ప్రజా చైతన్యమే...
# లక్ష్యం
తెలుగు దినపత్రిక
ఎడిటర్ ఇన్ చీఫ్ - మధుసూదనరావు చల్లా
email : lakshyam2013@gmail.com
R.N.I. No. APTEL/2013/48712
Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.
ఎడిటర్ ఇన్ చీఫ్ - మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010
సంపుటి : 12 సంచిక : 114 గుంటూరు శనివారం 31 మే 2025 పేజీలు : 8 వెల : 5.00

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

## ఆపరేషన్ కగార్‌లో పోలీసుల ప్రతిభ..

### ప్రభుత్వ ప్రోత్సాహకాలు..

రాయ్‌పూర్ : పోలీస్ సిబ్బందికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మావోయిస్టుల అణచివేతలో సమర్థవంతంగా పని చేసిన పోలీసులకు పదోన్నతులు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. దాదాపు 295 మందికి ఆ రాష్ట్ర పోలీస్ శాఖ పదోన్నతి కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన పదోన్నతులు జాబితాను ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్ గౌతమ్ శుక్రవారం రాయ్‌పూర్‌లో విడుదల చేశారు. రిజర్వ్ ఫోర్స్ నుంచి డీఎస్పీ వరకు అన్ని విభాగాల అధికారులకూ ఈ పదోన్నతులు కల్పించినట్లు జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేశారు. మావోయిస్టులకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నా.. బస్తర్‌లో విధులు నిర్వహించిన వారికి ఈ పదోన్నతులు కల్పించారు.

## బీజేపీ చర్యను స్వాగతించిన కాంగ్రెస్ ఎంపీ

న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ సల్మాన్ ఖుర్షీద్ స్వాగతించారు. ఆర్టికల్ 370 జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించేదని ఆయన అన్నారు. తద్వారా దేశంలోనే ఆ రాష్ట్రం ఉన్నా.. మిగిలిన ప్రాంతాలతో వేరుగా ఉన్నట్లు ఓ భావన ఉండేదన్నారు. కానీ ఈ ఆర్టికల్ రద్దుతో ఆ భావన తమలో పూర్తిగా పోయిందని తెలిపారు. ఈ ఆర్టికల్ రద్దు అనంతరం ఆ రాష్ట్ర ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందని, ఆ క్రమంలో జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 65శాతం మేర పోలింగ్ నమోదయిందని గుర్తు చేశారు. దీంతో రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఏర్పాటైందని వివరించారు.

## పారిశ్రామికవేత్తల ద్వారానే సంపద సృష్టి సాధ్యం: సీఎం చంద్రబాబు




దిల్లీ: సంపద సృష్టి జరగకపోతే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేమని.. సంపద సృష్టి పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలు, ఏపీలో అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను వివరించారు. సంపద సృష్టిలో ఏపీకి పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరారు. పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చేశాయన్నారు. 1990లో ఇంటర్‌నెట్ విప్లవం వచ్చిందని, దాన్ని ముందుగా అందుకున్న వాళ్లలో తానూ ఒకడినని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌కు జనాభా అనుకూలత ఉందన్న చంద్రబాబు.. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను భారత్ సరిగ్గా ఉపయోగించుకోవాలన్నారు.

**మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం..** "ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాలు, సెన్సార్లు, ఐఓటీలు.. ఇలా చాలా టెక్నాలజీ వచ్చింది. ఇప్పుడు సమాజానికి కావాల్సింది పారిశ్రామికవేత్తలే. నేను నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఉన్నా.. చాలా మంది నాయకులను చూశాను. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ప్రధానిగా ఉన్నారు. మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నాను.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నాను. విశాఖలో టీసీఎస్ మొదలవుతోంది.. ఆర్సెల్లార్ మిట్టల్ పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. విశాఖకు గూగుల్ రాబోతోంది. ఏపీలో గ్రీన్ ఎనర్జీకి మంచి అవకాశాలు ఉన్నాయి. సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ.. అన్నింటిలోనూ ఏపీ ముందు వరుసలో ఉంది. గ్రీన్ ఎనర్జీ కోసం ఎన్నో కంపెనీలు చాలా ఆసక్తిగా ఉన్నాయి. ఏడాదిలో రూ. 5లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు అందుకున్నాం. ఈ ప్రాజెక్టుల ద్వారా నాలుగున్నర లక్షల ఉద్యోగాలు వస్తాయి. మైనింగ్, టూరిజంలోనూ ఏపీలో మంచి అవకాశాలు ఉన్నాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటవుతోంది. 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తాం.

ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలన్నదే నా లక్ష్యం. గతంలో ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు వరుసగా 7-8 ఏళ్లు సీఐఐ సదస్సులు నిర్వహించాం. మొదటి నుంచి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ వచ్చాను" అని చంద్రబాబు వివరించారు.




## మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి.. మమ్మల్ని లాగొద్దు: కవిత వ్యాఖ్యలపై రఘునందన్

హైదరాబాద్: భాజపా ఎదుగుదలను ఆపాలని కుట్రలు పన్నుతున్నారని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. "చిట్‌చాట్‌లు ఎందుకు?.. ధైర్యముంటే ప్రెస్‌మీట్‌లు పెట్టండి. తప్పుడు వార్తలు రాయిస్తున్నారని చెప్పడం ఎందుకు? భారాసతో మా పార్టీ అధిష్ఠానం ఎప్పుడూ మాట్లాడలేదు. లేనిపోని పంచాయితీలు ఎందుకు?.. కుండ బద్దలు కొట్టినట్లు చెప్పండి. చిట్‌చాట్‌ల పేరుతో మా పార్టీని వివాదంలోకి లాగొద్దని కవితకు విజ్ఞప్తి చేస్తున్నా. మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి.. మమ్మల్ని లాగొద్దు. తెరాస (ప్రస్తుతం భారాస) గతంలో అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2004లో కాంగ్రెస్‌తో తెరాస పొత్తు పెట్టుకుంది. 2009లో మహా కూటమి పేరుతో పలు పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2014లో పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామన్నది ఎవరు? భారాసతో భాజపా ఎప్పుడైనా పొత్తు పెట్టుకుందా? రాష్ట్రంలో భాజపా బలం పుంజుకుంటోంది.. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది. పార్లమెంటు ఎన్నికల్లో భారాస ఒక్క సీటూ గెలవలేదు. ఆ పార్టీ చెల్లని రూపాయిగా మారిందని ప్రజలు భావిస్తున్నారు. భాజపా, భారాస ఒక్కటనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత చెల్లని రూపాయి అయ్యారు. పదేళ్ల పాలనలో అమరుడు శ్రీకాంత్‌చారి కుటుంబానికి ఏమీ దక్కలేదు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన 1200 మంది అమరులను పట్టించుకోలేదు. కేసీఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుంది. హరీశ్‌రావు భాజపా కోవర్టు అయితే మంత్రివర్గం నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదు? భారాస బలహీనపడాలి అనుకునేవాళ్లే కవిత వెనక ఉన్నారు. ఆమె కొత్త పార్టీ పెడుతోందని నాకు సమాచారముంది. భారాసకు అభ్యర్థులు లేక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కోవర్టు పని చేసే వాళ్లు భాజపాలో ఉండరు" రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు.




అమరావతి: ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులు, మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితులైన నలుగురిని సిట్ కస్టడీకి తీసుకుంది. ఐటీ శాఖ మాజీ సలహాదారు రాజ్ కెసిరెడ్డి, సీఎంవో మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను విజయవాడలోని జిల్లా జైలు నుంచి అధికారులు కస్టడీకి తీసుకున్నారు. జైలు నుంచి ఆరోగ్య పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తయ్యాక నిందితులను సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు. వారిని విచారించనున్నారు. మద్యం కుంభకోణం కేసులో ఈ నలుగురిని రెండు రోజుల పాటు సిట్ కస్టడీకి ఇస్తూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్ర, శనివారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకూ నలుగురినీ కస్టడీలో విచారించేందుకు అనుమతిచ్చింది. కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తు చివరిగా ఎక్కడికి చేరిందో వీరికి తెలుసని, 'అంతిమ లబ్ధిదారు'కు డబ్బు చేర్చడంలో వీరు కీలకంగా వ్యవహరించారని గుర్తించిన సిట్.. ఆ కోణంలో ప్రశ్నించేందుకు సిద్ధమవుతోంది. కుట్రకు రూపకల్పన, అమలు, ముడుపుల వసూళ్లు, ఆ మొత్తాల్ని 'బిగ్‌బాస్'కు, ఆయన సతీమణికి చేర్చడంలో ఈ నలుగురి పాత్రపై ఇప్పటికే కొన్ని కీలక ఆధారాల్ని సేకరించిన దర్యాప్తు అధికారులు.. వాటి ఆధారంగా మరింత లోతుగా వివరాలు రాబట్టనున్నారు.



## కొత్తగూడెంలో 17 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం నేరవిభాగం: కొత్తగూడెంలో 17 మంది మావోయిస్టు సభ్యులు జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారుల సమక్షంలో లొంగిపోయారు.

ఈ సందర్భంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడారు. లొంగిపోయిన వారిలో ఏసీఎం క్యాడర్‌కు చెందిన ఇద్దరు, పార్టీ సభ్యులు నలుగురు, మిలీషియా సభ్యులు 11 మంది ఉన్నట్లు వివరించారు. ఏజెన్సీ ప్రాంత వాసుల్లో మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం సన్నగిల్లిందన్నారు. తెలంగాణలో మావోయిస్టులకు ఆశ్రయం ఉండే పరిస్థితులు లేవని చెప్పారు. విశ్వసనీయ సమాచారంతో ఇటీవల జిల్లాలో 20 మంది సాయుధ దళ సభ్యులను అరెస్టు చేసి 12 ఆయుధాలను జప్తు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 282 మంది మావోయిస్టు దళ సభ్యులు జనజీవన స్రవంతిలో కలిసి తగిన పునరావాస సౌకర్యాలను పొందినట్లు ఎస్పీ వివరించారు.

## అద్భుతంగా 'మహానాడు'.. మంత్రులంతా కార్యకర్తల్లా పనిచేశారు: సీఎం చంద్రబాబు



అమరావతి: కడపలో మహానాడు అద్భుతంగా జరిగిందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. జిల్లా నాయకత్వమంతా కలిసి పనిచేసి విజయవంతం చేశారని చెప్పారు. ఇందుకు కృషి చేసిన నేతలు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. సమష్టిగా చేస్తే ఏదైనా సాధ్యమని మహానాడుతో నిరూపితమైందన్నారు. మంత్రులంతా కార్యకర్తల్లాగా పనిచేసి స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. "మహానాడులో ప్రవేశపెట్టిన ఆరు శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తున్నాం.

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనపై ప్రజల్లో సానుకూలత ఉంది. ఎమ్మెల్యేలు కూడా విధిగా పేదల సేవలో పాల్గొనాలి. ప్రతిఒక్కరికీ సంక్షేమం అందేలా సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటిస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నిర్మాత ఎ.ఎం రత్నం



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సినీ నిర్మాత ఎ.ఎం.రత్నం కలిశారు. 'హరిహర వీరమల్లు' చిత్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 17వ శతాబ్దానికి సంబంధించిన కథతో రూపొందిన 'హరిహర వీరమల్లు' గురించి ఆయన సీఎంతో చర్చించారని పేర్కొంది. అలాగే తెలంగాణలో ఈ సినిమా టికెట్ ధరల గురించి కూడా ప్రస్తావించినట్లు తెలిపింది. తన విలువైన సమయాన్ని కేటాయించినందుకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఎ.ఎం రత్నం కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రాబోతున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందిన ఈ చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే.

## 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల స్టేట్‌గా ఏపీ.. ఇదే మా లక్ష్యం



విజయవాడ, మే 30: తాను కూడా చార్టెడ్ అకౌంటెంట్ కావాలనుకుని ఆర్టికల్స్ కూడా చేశానని.. చివరకు పొలిటీషియన్ అయ్యానని అన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. ఈరోజు (శనివారం) ఐసీఏఐ జాతీయ విద్యార్థుల సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. కొన్ని లెక్కలకు సంబందించి ఆరు సంవత్సరాల తరువాత ఆడిటింగ్ చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ లెక్కలు ఇంకా ఆలస్యం కావడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. భారతదేశంలో ఏ రాజకీయ నాయకుడుకైనా చార్టెడ్ అకౌంటెంట్ లేదా లాయర్ సహాయం తప్పనిసరని అన్నారు. వ్యవసాయాదారిత దేశం టెక్నాలజీ ఆదారిత ఆర్థిక వ్యవస్థగా మారుతోందన్నారు. కొనుగోలు శక్తిలో మనదేశం జపాన్‌ను దాటేసిందని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి త్వరలో అంతర్జాతీయ కంపెనీలు, గ్లోబల్ చైన్లు రాబోతున్నాయన్నారు. 'వాటికి మీ అవసరం ఉంది, ఈ ఏడాది చివరకు భారతదేశం నాలుగు ట్రిలియన్ డాలర్ల ఏకనామిగా మారుతుంది' అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 2.4 ట్రిలియన్ డాలర్ల స్టేట్‌గా 2047 నాటికి ఏపీ లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. వాట్సాప్ ద్వారా పంట కొనుగోలుకు అవకాశం ఇస్తే 74 వేల మంది రిజిస్ట్రార్ అయి 18 వేల మంది తమ పంటను పూర్తి స్థాయిలో టెక్నాలజీని వాడుకుని అమ్మారన్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ గేమ్ చేంజర్ అవుతుందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు త్వరలోనే అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. రైతులు అమ్మిన ధాన్యం బస్తాలకు క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పీ4లో ప్రజలను కూడా భాగస్వామ్యం చేయడానికి కారణం వారు కూడా ఈ దేశాభివృద్దిలో తమ వంతు ప్రయత్నం చేస్తుండడమే అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## అన్నింటినీ భరించుకుంటూ వచ్చా.. సిన్సియర్‌గా పనిచేశా.. అయినప్పటికీ




మంచిర్యాల, మే 30: జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన కొనసాగుతోంది. భారీ కాన్వాయ్‌తో శ్రీరాంపూర్ చేరుకున్న కవితకు జాగృతి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కవిత పర్యటనకు బీఆర్ఎస్ నేతలు దూరంగా ఉన్నారు. ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలోకు వచ్చిన ఎమ్మెల్సీ.. పలువురు జాగృతి నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియా నిర్వహించిన చిట్‌చాట్‌లో మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు కవిత. తాను రాసిన లేఖకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదన చెందే లేఖ రాశానని.. పార్టీ బాగు కోసమే లెటర్ రాసినట్లు తెలిపారు. సామాన్య కార్యకర్తలు ఏమి కోరుకుంటున్నారో అదే విషయాన్ని లేఖ ద్వారా పార్టీ చీఫ్ కేసీఆర్‌కు వివరించానని తెలిపారు. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడ్డానని అన్నారు. పదేళ్లుగా ఎంతో ఆవేదనను అనుభవించానని.. అన్నింటినీ భరించుకుంటూ వచ్చానని చెప్పారు. పార్టీలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. పార్టీ అభివృద్ధి కోసం, పార్టీ బలోపేతం కోసం ఎంతగానో కృషి చేశానన్నారు. ఉద్యమం నుంచి మొదలు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కూడా పార్టీ కోసం సిన్సియర్‌గా పనిచేశానని.. అయినప్పటికీ కొన్ని అంశాలు తనను బాధించాయన్నారు. అంతేకాకుండా.. తనను జైలు పాలు చేసిన బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేయాలని చూశారని, బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని అనుకున్నారని చెప్పారు. తాను జైల్లో ఉంటే బీజేపీతో పొత్తు ప్రస్తావన తేవడంతో ఆవేదన చెందానని ఎమ్మెల్సీ అన్నారు. బీజేపీతో కలవడం అనవసరమని.. ఆ పార్టీతో కలిసిన ఏ పార్టీ కూడా బతికి బట్ట కట్టలేదని వ్యాఖ్యలు చేశారు. అందుకోసమే విలీనం వద్దంటూ పార్టీకి లేఖ ద్వారా స్పష్టం చేశానని చెప్పుకొచ్చారు. అధినేతను కలవాలని, చెప్పాలని ప్రయత్నం చేశానని.. తన తండ్రిని కలిసేందుకు అవకాశం వచ్చినా.. లెటర్ లీక్‌తో తాను కలవలేకపోయినట్లు చెప్పారు. గతంలో కూడా లేఖలు రాశానని.. కానీ ఈసారి తనను టార్గెట్ చేస్తూ ఒక పథకం ప్రకారమే లేఖను లీక్ చేశారని మరోసారి చెప్పారు. లెటర్ లీక్ చేసిన వారెవరో తేల్చాలని అన్నారు. తనకంటూ సొంత అజెండా ఏమీ లేదన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి ఒప్పుకోనని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. కాగా.. గత రెండు రోజులుగా కవిత పరిణామాలు, ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరోసారి కవిత తన మనసులో మాటను చిట్‌చాట్ ద్వారా బయటపెట్టారు. దీంతో కవిత ఎపిసోడ్ బీఆర్ఎస్‌లో తీవ్ర సంచలనంగా మారింది.

# బీఎస్ఎఫ్ దెబ్బకు.. పాక్ ఇప్పట్లో కోలుకోవడం కష్టమే!: అమిత్ షా



పాకిస్థాన్ దుశ్చర్యలను దీటుగా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాలపై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. ఇటీవల చేపట్టిన సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కూల్చివేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ఆయన.. బీఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉందన్నారు. "ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది.

వీటిని మన బీఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చేశాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం.. పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దులో ఎటువంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు.

**త్వరలో ప్యాకేజీ..** జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు.

పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన అక్కడి స్థానికులతో మాట్లాడారు.



# తెలుగు సినిమా రెండు కాదు.. ఏపీ, తెలంగాణకు ఒక్కటే

## ఒకే సినిమాకు రెండు రాష్ట్రాల్లో అవార్డులు ఇస్తే బాగోదు: మురళీమోహన్

హైదరాబాద్: ఏపీలోనూ సినీ అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ప్రముఖ సినీనటుడు మురళీమోహన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించే గద్దర్ అవార్డుల ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒకే తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అవార్డులు ఇవ్వడం బాగుండదన్నారు. దీనిపై రెండు ప్రభుత్వాలు ఒక అవగాహనకు రావాలని.. ఒక ఏడాది తెలంగాణ, మరో ఏడాది ఏపీ ప్రభుత్వాలు పురస్కారాలను ప్రకటించాలని సూచించారు. "తెలంగాణలో ఈ సినిమాకు.. ఆంధ్రాలో ఆ సినిమాకు అవార్డు ఇచ్చారనేది వివాదానికి దారితీస్తుంది. తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలూ కావాలి. ఒక రాష్ట్రం ఎక్కువ.. మరో రాష్ట్రం తక్కువ కాదు. సినిమాకు సంబంధించి తెలుగు ప్రేక్షకులంతా ఒకటే.

మన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శితమవుతున్నాయి. తెలుగు సినిమాలను మనకంటే ముందు అమెరికా వాళ్లు చూస్తున్నారు" అని మురళీమోహన్ అన్నారు.



# కెనడాలో భీకర కార్చిచ్చు

కెనడా పశ్చిమాన సస్కెట్చివాన్ ప్రావిన్స్‌లో కార్చిచ్చు వ్యాపించడంతో అత్యవసర పరిస్థితి విధించారు. ఇప్పటికే మాంటోబా ప్రావిన్స్‌లో దీని కారణంగా దాదాపు 17,000 మందిని ఇళ్లు ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాము తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నామని సస్కట్చెవాన్ ప్రావిన్స్ ప్రీమియర్ స్కాట్‌మో పేర్కొన్నారు. విపత్తును ఎదుర్కోవడానికి సిద్ధంగా అన్ని చర్యలూ తీసుకొన్నామన్నారు. ఈ ప్రావిన్స్ నుంచి ఇప్పటికే 4,000 మందిని తరలించారు. 6,69,000 ఎకరాల్లో ఇది వ్యాపించింది. పరిస్థితి ఏమాత్రం అనుకూలంగా లేదని.. రానురాను సంక్లిష్టంగా మారే అవకాశముందని సిబ్బంది చెబుతున్నారు. ఇక బుధవారం మాంటోబా ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితి విధించారు. చిన్నచిన్న ఊళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ ఈ స్థాయి కార్చిచ్చు చూడలేదని అధికారులు అంటున్నారు. ప్రజలను తరలించేందుకు కెనడా వైమానిక దళం రంగంలోకి దిగింది. ఈ ప్రావిన్స్‌లో 1,73,000 ఎకరాలు కాలి బూడిదయ్యాయి. రెండు లేదా మూడు రోజులు వర్షం పడితేగానీ ఈ కార్చిచ్చు అదుపులోకి రాదని భావిస్తున్నారు. ఇక్కడి నుంచి వస్తున్న పొగ.. అమెరికాలోని మిన్నెసోటా, మిషిగాన్ తదితర రాష్ట్రాల వైపు వెళుతోంది. ఈ రెండు ప్రావిన్సుల్లోనే 2025లో 15 లక్షల ఎకరాలు దగ్ధమయ్యాయి. కెనడా సహజ వనరుల విభాగం లెక్కల ప్రకారం మొత్తం 6,000 కార్చిచ్చులు కలిపి 3.7 కోట్ల ఎకరాలను కాల్చేసినట్లు తెలుస్తోంది. కెనడా కార్చిచ్చుల వల్ల అమెరికాలో ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నట్లు ది అమెరికన్ లంగ్ అసోసియేషన్ 2025లో ఇచ్చిన స్టేట్ ఆఫ్ ది ఎయిర్ రిపోర్టు పేర్కొంది.

# వాస్తవాల ప్రాతిపదికన పథకాలు తీసుకొస్తాం: మంత్రి సీతక్క



హైదరాబాద్, మే 30: తెలంగాణలో విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, నేర్చుకునే సామర్థ్యం, పని, కుటుంబ పరిస్థితులపై సెస్ సర్వే చేయడం అభినందనీయమని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈరోజు (శనివారం) బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ ప్రాంగణంలో యంగ్ లైవ్స్ రౌండ్ – 7 సర్వే నివేదికను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సర్వే నివేదికలు విధాన రూపకల్పనలో ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనాల వల్ల ప్రభుత్వ విధానాల్లో ఏవైనా లోటు పాట్లు ఉంటే సవరించుకోవచ్చని చెప్పారు. తెలంగాణలో విద్య, వైద్యం, పౌష్టికాహారం కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పాఠశాలల్లో ప్రభుత్వ హాస్టళ్లలో మెరుగైన విద్యతో పాటు, మెరుగైన భోజన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. సరైన పౌష్టికాహారం లేకపోతే విద్యార్థులు విద్య మీద దృష్టి సారించలేకపోతున్నారని అన్నారు. ఒక ఆదివాసి బిడ్డగా తనకు ఆకలి బాధ తెలుసన్నారు. అందుకే ఎక్కడ ఫుడ్ గ్యాప్స్ లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అమ్మాయిల్లో రక్తహీనతను నివారించేందుకు పోషకాలతో కూడిన చిక్కిల పంపిణీ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. సెస్ నిర్వహిస్తున్న సర్వేలకు, అధ్యయనాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. సెస్ ఇచ్చే వాస్తవాల ప్రాతిపదికన ప్రజా సంక్షేమం కోసం మరిన్ని పథకాలు తీసుకొస్తామన్నారు. సర్వేలు కేవలం సర్వేల కోసమే జరగకూడదని.. ప్రజల సమస్యలు, అభివృద్ధి ఆకాంక్షలు, విధానపరమైన లోటు పాట్లు తెలిపేలా సర్వేలు జరగాలని అన్నారు. వాస్తవాల ప్రాతిపదికన రూపొందిన సర్వేలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి పథకాలను రూపొందిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

**మంత్రి ఔదార్యం...** ఫిట్స్‌తో బాధపడుతున్న వ్యక్త పట్ల మంత్రి సీతక్క మానవత్వాన్ని చూపారు. పంజాగుట్ట ఫ్లైఓవర్‌పై ఓ వాహనదారుడికి ఫిట్స్ వచ్చాయి. ఆ మార్గంలో వెళ్తున్న మంత్రి సీతక్క.. తక్షణమే స్పందించారు. తన వాహనాన్ని ఆపి అతని చేతిలో తాళం చెవులు పెట్టారు. అతను కోలుకునేదాకా మంత్రి సహాయపడ్డారు. అతను కుదుటపడే వరకు అక్కడే ఉండి ధైర్యం చెప్పి ఆ తరువాత సదరు వ్యక్తిని ఆస్పత్రికి పంపించారు. మంత్రి సీతక్క ఔదార్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ హ్యాట్సాఫ్ చెబుతున్నారు.

# తిరుమలలో భద్రత బలోపేతంపై డీజీపీ, తితిదే ఈవో ఉన్నత స్థాయి సమావేశం



తిరుమల: దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తిరుమలలో భద్రత బలోపేతంపై ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, తితిదే ఈవో జె.శ్యామలరావు సమక్షంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో తిరుపతి ఎస్పీ, తితిదే ఇన్‌ఛార్జ్ సీవీఎస్‌వో హర్షవర్ధన్ రాజు భద్రతా అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో తిరుమలకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని తెలిపారు. ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హెూంగార్డు, సివిల్ పోలీసులు, తితిదే సెక్యూరిటీతోపాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ సెక్యూరిటీ ఏజెన్సీలకు స్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించాలన్నారు. అలిపిరి వద్ద బహుళ స్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలిసి సెన్సార్ ప్లే సిస్టమ్, ఆధునిక భద్రతా పరికరాలు, సైబర్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. తితిదే ఈవో జె. శ్యామలరావు మాట్లాడుతూ.. భద్రతపై అనుబంధ ఏజెన్సీలతో ఒక సమన్వయ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. తిరుమలలో సైబర్ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. విస్తృతస్థాయిలో తిరుమల భద్రతపై సమీక్ష నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీజీ(లా అండ్ ఆర్డర్) సుధాకర్‌రెడ్డి, అడిషనల్ డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్హా, అనంతపురం రేంజ్ డీఐజీ డా.శేముషి, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, తితిదే అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పీవోకేను పాకిస్థాన్‌కు ఎవరు ఇచ్చారు?: కిషన్‌రెడ్డి



దిల్లీ: భారత సైన్యం విజయాన్ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తక్కువ చేసి మాట్లాడటం దుర్మార్గమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. సైన్యం విజయాన్ని దేశమంతా పండుగ చేసుకుంటుంటే రేవంత్‌రెడ్డికి అది భాజపా కార్యక్రమంగా కనిపిస్తుందా అని మండిపడ్డారు. "మన ఎంపీలు పార్టీలను పక్కన పెట్టి ప్రపంచమంతా తిరుగుతున్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఎందుకు చేయాల్సి వచ్చిందో ప్రపంచానికి చెబుతున్నారు. అసలు పీవోకేను పాకిస్థాన్‌కు ఎవరు ఇచ్చారు?. కాంగ్రెస్ కారణంగానే పీవోకే అంశం రావణ కాష్టంగా రగులుతూనే ఉంది. ఉగ్రవాదులు దాడి చేస్తే గత కాంగ్రెస్ ప్రభుత్వాల్లాగా సంతాపాలతో సరిపుచ్చుకోలేదు. పాక్ భూభాగంలోకి వెళ్లి మరీ సర్జికల్ స్ట్రైక్ చేసింది మోదీ సర్కారు. పహల్గాం దాడి తర్వాత పాకిస్థాన్‌కు ఎలా నరకం చూపించామో ప్రపంచం చూసింది"అని కిషన్‌రెడ్డి అన్నారు.

# ఈటల, హరీశ్‌రావు ఇద్దరూ కలిసి .. కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు: మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్: సర్జికల్ స్ట్రయిక్స్ చేసి గొప్పలు చెప్పుకొంటు న్నారు.. అప్పట్లో ఇందిరా గాంధీ వందల కొద్దీ సర్జికల్ స్ట్రయిక్స్ చేసినా ఏనాడూ చెప్పుకోలేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరాగాంధీ గొప్పతనాన్ని ఆనాడు వాజ్‌పేయీ కూడా గుర్తించి.. అపర కాళీ అని మెచ్చుకున్నారని గుర్తు చేశారు. అసలు ఇందిరాగాంధీకి.. మోదీకి పోలిక ఏంటని ప్రశ్నించారు. "భాజపా, భారాస సయోధ్య గురించి కవిత ఇప్పుడు బయటపెడుతున్నారు. బండి సంజయ్‌ను భాజపా అధ్యక్ష పదవి నుంచి అన్యాయంగా తొలగించలేదా? భారాసతో దోస్తీకి అడ్డుగా ఉన్నందుకే సంజయ్‌ను తొలగించింది వాస్తవం కాదా? భాజపా నేతల ప్యాకేజీల గురించి రాజాసింగే చెబుతున్నారు. రాజాసింగ్ మాటలకు ఆ పార్టీ పెద్దలు సమాధానం చెప్పాలి. షామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఈటల రాజేందర్, హరీశ్‌రావును కలిశారు. ఇద్దరూ కలిసి కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈటల రాజేందర్.. మోదీ పార్టీలో ఉన్నారా? కేసీఆర్ పార్టీలో ఉన్నారా? కాళేశ్వరం స్కామ్ నుంచి బయటపడేందుకు ఈటల.. కేసీఆర్‌తో చేతులు కలుపుతున్నారు" అని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు.

# భారత్‌ను ఆపాలని పాక్ ప్రపంచ దేశాలను వేడుకుంది: రాజ్‌నాథ్ సింగ్




భారత నౌకాదళానికి చెందిన విమాన వాహకనౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ను శుక్రవారం కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అక్కడి అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మన దేశం శక్తిమంతమైన దాడులు చేయడంతో భారత్‌ను ఆపాలని పాకిస్థాన్ ప్రపంచదేశాలను వేడుకుంది. మన నిబంధనల ప్రకారమే సైనిక చర్యలను ఆపేశాం. ఆపరేషన్ సమయంలో నేవీ పాత్ర అద్భుతమైనది. పాక్ గడ్డపై ఉన్న ఉగ్రవాద స్థావరాలను వైమానిక దళం నేలమట్టం చేసింది. అదే సమయంలో మన నావికా దళం సముద్రంలో చూపిన సంసిద్ధత పాక్ నావికాదళాన్ని ఎక్కడికీ కదలనీయకుండా చేసింది. మీ ముందస్తు మోహరింపుతో పాక్ ధైర్యంపై దెబ్బకొట్టారు. మీరు పాక్‌పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదు. మీ సన్నద్ధతే దాయాదికి గట్టి హెచ్చరిక. భారత నావికాదళ శక్తిని, సైనిక చర్యలను, సామర్థ్యాలను చూసి శత్రుదేశం భయాందోళనకు గురైంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని.. ఇచ్చింది విరామమేనని పేర్కొన్నారు. పాక్ మరో తప్పు చేస్తే ఈసారి కోలుకునే అవకాశమే లేకుండా గట్టిగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించి పాక్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే పాక్ ప్రతిస్పందనను నావికాదళం పసిగట్టి.. తమ సంసిద్ధతను గణనీయంగా పెంచడానికి పలు చర్యలు తీసుకుంది. పాక్‌లోని కరాచీ పోర్టు లక్ష్యంగా ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించింది.

# ఇందిరమ్మ ఇళ్లకు 2.10లక్షల లబ్ధిదారులు ఎంపిక: పొంగులేటి



హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటి వరకు 2.10లక్షల మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల 10లోగా మిగతా లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టులో 42వేల ఇళ్లు మంజూరు చేయగా.. 24వేలు ప్రారంభమయ్యాయని, సుమారు వంద ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. "లబ్ధిదారుల జాబితాకు సంబంధించి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను 40 శాతం పేర్లు ఇవ్వమన్నాం. మిగతా 60శాతం ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేస్తాయి. కేటీఆర్ జాబితా ఇవ్వలేదు.. అధికారులనే ఎంపిక చేయమన్నారు. ఐటీడీఏ పరిధిలో చెంచులకు 9,200 ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్‌లోని 16 స్లమ్స్‌లో నాలుగంతస్తుల భవనాలు నిర్మిస్తాం. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిర్మిస్తాం"అని మంత్రి తెలిపారు.




# గోవాలో హైదరాబాద్ రౌడీ షీటర్ అరెస్ట్

పనాజీ: గోవా లో హైదరాబాద్ రౌడీ షీటర్ అల్తాఫ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గోవాలోని కాసినో వద్ద హైదరాబాద్ మైలార్ దేవ్ పల్లికి చెందిన రౌడీ షీటర్ అల్తాఫ్ మద్యం మత్తులో ఇద్దరు సెక్యూరిటీ గార్డులపై దాడి చేశాడు. కాసినో వద్ద వీరంగం సృష్టించటంతో సెక్యూరిటీ గార్డులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారిపై దాడి చేసి హైదరాబాద్ పారిపోయే ప్రయత్నం చేయగా.. గోవా ఎయిర్ పోర్టులో అల్తాఫ్‌ను గోవా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోవా కాసినోలో హైదరాబాద్ రౌడీ షీటర్ హల్ చల్ సృష్టించిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. గొడవలో కాసినో ఈవెంట్ సెక్యూరిటీ గార్డులపై దాడి చేసి పారిపోయి హైదరాబాద్ వస్తుండగా గోవా పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్ మైలార్ దేవ్ పల్లికి చెందిన రౌడీ షీటర్ అల్తాఫ్ మరో ముగ్గురు స్నేహితులతో కలిసి రెండు రోజుల క్రితం గోవా వెళ్లాడు. బుధవారం రాత్రి గోవా పానాజీ క్యాంపుల్ లోని కాసినోకు వెళ్లారు. అక్కడ సెక్యూరిటీ గార్డులుగా ఉన్న ధీరు శర్మ, సత్యం గోంకర్‌లతో గొడవపడ్డాడు. దురుసుగా ప్రవర్తించవద్దని సెక్యూరిటీ గార్డులు కోరినప్పటికీ, అల్తాఫ్ వెనక్కి తగ్గలేదు. వారిపై ఇనుప రాడ్‌తో దాడి చేసాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ధీరు శర్మ మరణించాడు. దీంతో రౌడీ షీటర్ అల్తాఫ్ హైదరాబాద్ పారిపోయేందుకు యత్నించడంతో గోవా పోలీసులు అరెస్టు చేశారు. మరో సెక్యూరిటీ గార్డు సత్యం గోంకర్ గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ కేసును ఎస్పీ రాహుల్ గుప్తా సారధ్యంలో దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేకాట నిషేధం ఉండడంతో హైదరాబాద్‌కు చెందిన రౌడీ షీటర్‌లు గోవాలో పేకాట ఈవెంట్‌లను నిర్వహిస్తూ.. పేకాట రాయుళ్లను అక్కడికి విమానాల్లో తీసుకువెళ్లి కాసినో ఆడిస్తున్నట్లు సమాచారం.

## ఘనంగా ఎనుముల కేశవరెడ్డి జన్మదిన వేడుకలు

మాచర్ల లక్ష్యం ప్రతినిధి : తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకుడు ఎనుముల కేశవరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరిపారు. పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో ఎనుముల కేశవరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. నెహ్రూనగర్ టిడిపి కార్యాలయం, బస్టాండ్ సెంటర్, రింగ్‌రోడ్డు సెంటర్, పిడబ్ల్యూడీ కాలనీలో కేక్ కట్ చేశారు. దుర్గి మండలం ఆత్మకూరు కాశినాయన



వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎనుముల కేశవరెడ్డి మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు అందుబాటులోవుండి అండగా వుంటానని చెప్పారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్తిపాటి ఫౌండేషన్ మెగా కంటి వైద్య శిబిరానికి అద్భుతమైన స్పందన వచ్చింది.. కన్వీనర్ కంచర్ల శ్రీనివాసరావు

చిలకలూరిపేట టౌన్ మే 30 (లక్ష్యం న్యూస్):చిలకలూరిపేటలో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన మెగా కంటి వైద్య శిబిరానికి అద్భుతమైన స్పందన లభించిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి దాదాపు 10,000 మంది వృద్ధులు హాజరయ్యారని ఈ శిబిరంలో 10,000 మంది వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 6,000 మందికి




కంటి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారని శిబిరాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ క్యాంపు కన్వీనర్ కంచర్ల శ్రీనివాస రావు కృతజ్ఞతలు తెలిపారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన వారి సౌకర్యార్థం, శంకర్ కంటి ఆసుపత్రికి చెందిన బస్సు ప్రతిరోజు ప్రత్తిపాటి గార్డెన్స్ వద్ద అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. శస్త్రచికిత్సలు చేయించుకోవాల్సిన వృద్ధులు వారికి కేటాయించిన తేదీల్లో బస్సు వద్దకు వచ్చి సేవలను వినియోగించుకోవాలని కోరారు.

## ఘనంగా పుతంబాకా వెంకటపతి వర్ధంతి

పెదనందిపాడు మే 30. (లక్ష్యం న్యూస్)గుంటూరు జిల్లా సిపిఎం పార్టీ మాజీ కార్యదర్శి,మాజీ శాసన సభ్యులు పుతుంబాక వెంకటపతి వర్ధంతి సందర్భంగా పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. తొలుత జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు వెంకటపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ వెంకటపతి పార్టీ అభ్యున్నతికి జీవితాంతం పాటుపడిన మహనీయుడని అన్నారు. జీవితాంతం రైతుల కోసం, పేద ప్రజల కోసం పాటు పడటమే



కాకుండా. ప్రజల సమస్యల మీద శాసనసభలో వెలుగెత్తి తన గళాన్ని వినిపించిన మహెూన్నత వ్యక్తి అన్నారు. పార్టీ చీలిక సమయంలో సిపిఎం వైపు నికరంగా నిలబడి రాష్ట్రం లో పార్టీ విస్తరణకు కృషి చేసిన నాయకులలో ఒకరని అన్నారు. ఎన్ని కష్ట నష్టాలు వచ్చినా పార్టీ కోసం క్రమశిక్షణగా పనిచేసిన నాయకుడని అన్నారు. వారి బాటలో నడవడమే వారికి మనమిచ్చే ఘనమైన నివాళులు అన్నారు .ఈ సంతాప సభలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, నాయకులు జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, మర్రి లక్ష్మి, కన్నెగంటి చంద్రరావు తదితరులుపాల్గొన్నారు.

## మోతె సమీపంలో బస్సు దగ్ధం

మోతె: సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రం సమీపంలోని సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై బస్సు దగ్ధమైంది. ఖమ్మం వెళ్తుండగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు టైరు పేలి మంటలు చెలరేగాయి. అనంతరం మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో డ్రైవర్ ఒకరే ఉండటం, బస్సు నుంచి దూకేయడంతో ప్రాణనష్టం జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

# రేపటి నుండి రేషన్ షాపుల వద్దే సరుకులు పంపిణీ

### నివేసిత స్థలాలు లేని వారు ధరఖాస్తులు చేసుకోండి : తహశీల్దార్ కిరణ్‌కుమార్



మాచర్ల లక్ష్యం ప్రతినిధి :జులై 1 తేదీ నుండి రేషన్ కార్డుల లబ్దిదారులు ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులను రేషన్ షాపుల వద్దకు వెళ్లి తీసుకోవాలని తహశీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన రేషన్ డీలర్ల సమీక్షా సమావేశం లో తహశీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ షాపుల వద్ద రేషన్ సరుకులు అందించేందుకు అన్నీ ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. ఒకటవ తేదీ నుండి గతంలో మాదిరిగా రేషన్ సరుకులు అందించే వాహనాలు రావని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరిచి వుంటాయని, 1వ తారీఖు ఆదివారం కూడా షాపు తెరిచి వుంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి రేషన్ సరుకులు తీసుకోవాలసి సూచించారు. రేషన్ డీలర్లు లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. నూతన రేషన్ కార్డు కొరకు, ఇప్పటికే ఉన్న కార్డులో అదనంగా కుటుంబ సభ్యుల యాడింగ్, మరణించిన, వివాహం అయిన కుటుంబ సభ్యుల తొలగింపు, చేర్పులు, కుటుంబ సభ్యుల విభజన చేయటం, ఆధార్ నమోదు చేయటం, రేషన్ కార్డును ఒక చోట నుండి మరోక చోటికి మార్చుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిన ట్లు తెలిపారు. లబ్దిదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వీటిపై ఏమైనా సందేహాలుంటే తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసి హెల్ప్ డెస్కు ను సంప్రదించాలని కోరారు. నివేసిత స్థలాలు లేనివారు ధరఖాస్తులు చేసుకోవాలని ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తహశీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు.

# వేలూరు డొంక రోడ్డు లో ఘనంగా ప్రత్తిపాటి జన్మదిన వేడుకలు

### బెజ్జం రవి ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు పంపిణీ



చిలకలూరిపేట మే 30( లక్ష్యం న్యూస్):మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు ను పురస్కరించుకొని 11వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు బెజ్జం రవి పఠాన్ సుభాని వార్డు నాయకులు కలిసి నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం వేలూరు డొంక రోడ్డు లో ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొని ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు వేడుకలను పేదల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు. తదుపరి నూతన వస్త్రాలను అక్కడి స్థానికులకు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పరిశ్రమించే మన నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు ను వాడా వాడల స్వచ్ఛందంగా ప్రజల ముందుకు వచ్చి చేస్తున్నారు అంటే ఆయన పట్ల నియోజవర్గ ప్రజలకు ఉన్న అభిమానంఏమిటనేది 5 ఏళ్ల కే నియోజకవర్గం వదలి పారిపోయిన నాయకురాలు గుర్తు ఉంచుకోవాలని హితవు పలికారు, ఆకాశం పై ఉమ్ము వేస్తే ఆది తిరిగి మన పైన పడుతుందనేది ఎంత సత్యమో 25 ఏళ్ల రాజకీయ జీవితంలో అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక నాయకుడు చిలకలూరిపేట నియోజకవర్గ అభివృద్ధికి భవిష్యత్ తరాల వారి కోసం మౌలిక వసతుల కల్పనకు, విద్యా, వైద్యం, కార్మిక రంగాల వారికి,రైతులకు, పర్యాటక రంగం అభివృద్ధి కానివ్వండి ఇప్పటివరకు వేల కోట్ల రూపాయల నిధులతో అభివృధి చేసింది మన పత్తిపాటి పుల్లారావు. ఆ విషయం నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు, గురివింద తన కిందఉన్న నలుపు ఎరగనట్టు, ఒక మొక్క మాట్లాడుతుంది ఆ మొక్కకు రాజకీయం అంటే పెత్తనం చలయించటం.తప్పుడు కేసులు పెట్టి జైలుకి పంపడం లక్షల రూపాయలు ఖర్చు పెట్టి సోషల్ మీడియా లో ప్రచారం చేసుకోవడం బెదిరించి డబ్బులు దండుకోవడం ప్రైవేట్ సైన్యం పెట్టుకొని ప్రభుత్వ వ్యవస్థలు ధ్వంసం చేయడం. ఇదే ఆమె దృష్టిలో రాజకీయం అంటే. వారికి సూటి అడుగుతున్నాంఎమ్మెల్యేగా గెలిచిన ఐదేళ్ల లో ఒక్కటంటే ఒక్క అభివృధి కార్యక్రమం మీ హయంలో చేపట్టారా...? ప్రజలు సరే కనీసం మీ గెలుపు కోసం పని చేసిన పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారా ?ఒక సారి ఆత్మవిమర్శ చేసుకోవాలని అన్నారు,సామాజిక స్పృహ సేవనీరతి కలిగిన మన శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పుట్టినరోజు ను పురస్కరించుకొని పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం హర్షణీయంమని పేదల ఆశీస్సులు ఆ దేవదేవుని దీవెనలతో ప్రతిపాటి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మున్సిపల్ కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు దగ్గుమల్లి సాంబశివరావు. జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ అబ్దుల్ మజీద్. టిడిపి నాయకులు షేక్ అజారుద్దీన్. తుపాకుల అప్పారావు. బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు పుల్లారావు. వార్డు తెలుగు యువత నాయకుడు పఠాన్ మౌలా. షేక్ రఫీ. మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జగన్ సంకుచిత మనస్తత్వం వల్లే పేదలు గృహయోగానికి దూరమయ్యారు : మాజీమంత్రి ప్రత్తిపాటి

**- పేదలకు సొంతిల్లు లేకుండా చేసి, 5 ఏళ్లు వారిని ఏడిపించిన ఘనత జగన్ దే**

**- టిడ్కో గృహాలు పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ప్రత్తిపాటి**





చిలకలూరిపేట టౌన్ మే 30( లక్ష్యం న్యూస్):జగన్మోహన్ రెడ్డి అసూయ, దుగ్ధ ఇళ్లులేని నిరుపేదలకు శాపంగా మారిందని, చంద్రబాబు 2014-19లో నిర్మించిన టిడ్కో ఇళ్లలో చిన్నచిన్న పనులు చేయించి పేదలకు ఇవ్వడానికి వైసీపీ ప్రభుత్వానికి మనసురాలేదని మాజీమంత్రి , శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణ శివారులోని ఎన్టీఆర్ నగర్ టిడ్కో సముదాయంలో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ లబ్దిదారులకు అందించాల్సిన సీలింగ్ ఫ్యాన్ల పంపిణీ ప్రారంభించిన మాజీమంత్రి, గృహస్తులకు ఫ్యాన్లు అందించి వారితో మాట్లాడి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. పేదలకు ఇచ్చిన మాటకు కట్టుబడి, వారిని ఒక ఇంటివారిని చేయాలన్న సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల భాగస్వామ్యంతో 2014-19లో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. టీడీపీ హాయాంలోనే ఇళ్ల నిర్మాణం 80 నుంచి 90 శాతం వరకు పూర్తైందని, రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో మౌలికవసతుల కల్పన పనులే నిలిచిపోయాయన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ చంద్రబాబు కట్టించిన ఇళ్లు పేదలకు ఇస్తే, తనకేమి ప్రయోజనమని భావించి బంగారం లాంటి ఇళ్లను పాడు పెట్టాడని ప్రత్తిపాటి తెలిపారు. చంద్రబాబుకు, టీడీపీకి పేరొస్తుందన్న దుగ్ధ, అసూయతోనే జగన్ పేదలను 5 ఏళ్లపాటు ఏడిపించాడన్నారు. నివాసానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించకుండా ఇళ్లను పాడుపెట్టింది కాక, తన పార్టీ రంగులేయించి, తానే నిర్మించినట్టు జగన్ గొప్పలు చెప్పుకున్నాడని ప్రత్తిపాటి ఎద్దేవాచేశారు. ఇళ్లనిర్మాణపనులు చేసిన కాంట్రాక్టర్లకు వైసీపీప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో వారు చేస్తున్న పనులు కూడా ఆపేశారన్నారు. దాంతో నిర్మాణదశ పూర్తై, నివాసానికి సిద్ధంగా ఉన్న లక్షల ఇళ్లు దయ్యాలకు ఆవాసాలుగా మారి నిరుపయోగంగా మారిపోయాయని ప్రత్తిపాటి తెలిపారు. జగన్ విపరీత మనస్తత్వానికి ఇదొక నిదర్శనమని, దానివల్లే ఎంతోమంది ఇళ్లులేని పేదలు నివాసయోగానికి దూరమై 5 ఏళ్లు ఎన్నో బాధలు పడ్డారన్నారు. అహంకారం, నిర్లక్ష్యంతో వ్యవహరించబట్టే 2024 ఎన్నికల్లో జగన్ ను, ఆయన పార్టీని ప్రజలు శాశ్వతంగా సాగనంపారని ప్రత్తిపాటి తెలిపారు.వీధిదీపాలు వెలగడం లేదని, రోడ్లమరమ్మతులు చేయాలని, రోడ్లపక్కన ఉన్న పిచ్చిమొక్కల్ని తొలగించాలని టిడ్కో లబ్ధిదారులు తెలియచేయడంతో, ప్రత్తిపాటి అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యల్ని పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ్లలో నివాసముండే వారికి ఏ ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, టీడీపీ నాయకులు షేక్ టిడీపీ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మధన్ మోహన్, మద్దుమాల రవి, జంగా సుజాత, జంగా వినాయక రావు, టీడీపీ నాయకులు, తదితరులున్నారు.

## చిన్నారి లోకేష్ సాయి ని ఆశీర్వాదించిన మర్రి రాజశేఖర్..



చిలకలూరిపేట మే 30(లక్ష్యం న్యూస్)రూరల్ మండలం లింగంగుంట్లగ్రామనికి చెందిన పెదవల్లి జగన్నాధం మనవడి ( పెదవల్లి రాజేంద్ర ప్రసాద్ కుమారుడు) నూతన వస్త్ర బహూకరణ వేడుక చిలకలూరిపేట పట్టణంలోని నన్నపనేని కన్వెన్షన్ నందు జరుగుచుండగా ఆ వేడుక లో శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ పాల్గొని చిరంజీవి లోకేష్ సాయి ని ఆశీర్వదించరు.ఈ వేడుకలో వారి వెంట పెదవల్లి వాసు, నాయుడు రమేష్, దొప్పలపూడి అప్పారావు, చాపలమడుగు రవి, నీరుకొండ బసవయ్య తదితరులున్నారు.

## మహానాడు ఘన విజయం వెనుక ప్రత్తిపాటి హస్తం ఉందనడంలో ఏమాత్రం సందేహం లేదు

### క్రమశిక్షణతో చేయి చేయి కలిపితేనే ఘనవిజయం సాధ్యం

చిలకలూరిపేట మే 30(లక్ష్యం న్యూస్):జన సమీకరణలో భాగంగా రాజంపేట నియోజకవర్గం ఇన్చార్జిగా వ్యవహరించిన మాజీ మంత్రి వర్యులు, తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు, ప్రతిపాటి పుల్లారావు రాజంపేట పార్లమెంట్ ఇంచార్జి అయిన చామర్తి జగన్మోహన్ రాజు తో కలిసి జన సమీకరణకు ఏర్పాట్లను పర్యవేక్షించారు పర్యవేక్షణలో భాగంగా ప్రత్తిపాటి ఆదేశాలతో జి డి సి సి బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు నందలూరు మండలం, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి అయిన షేక్ కరిముల్లా రాజంపేట రూరల్ మండలం. చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన ఐటీడీపీ నాయకులు మారెళ్ళ అప్పారావు వీరబల్లి మండలం), లీగల్



సెల్ నాయకులు ఎమ్ వెంకటరావు సుండుపల్లి మండలం, చిలకలూరిపేట పట్టణ టీడీపీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్.సిద్దవటం మండలం.సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మురుకొండ మల్లిబాబు రాజంపేట అర్బన్, క్లస్టర్ ఇంచార్జ్ అయిన ముల్లా కరీముల్లా ఒంటిమిట్ట మండలం మొత్తం ఎడుగురిని ఆరు మండలాలకు ఒక్కరిని అర్బన్ ఇంచార్జ్ లుగా నియమించి స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ ఒక్క రాజంపేట నియోజకవర్గం నుండే ముప్పై అయిదు వేలకు పైగా జన సమీకరణ చెయ్యడంలోప్రత్తిపాటి పుల్లారావు కృషి ఎనలేనిదనీ మహానాడు కు వెళ్ళిన టీడీపీ నాయకులు పేర్కొన్నారు

## చిత్తూరు జిల్లాలో పదోన్నతుల పై విచారణ చేపట్టండి

### - నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్...

గుంటూరు మే 30 (లక్ష్యం ప్రతినిధి)రాష్ట్ర వ్యాప్తంగా నిన్న జరిగిన గ్రేడ్ -%II% ప్రధానోపాధ్యాయులు పదోన్నతులలో ఒక్క చిత్తూరు జిల్లా లో నిబంధనలు కు విరుద్ధంగా చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి వర లక్ష్మీ చేపట్టిందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు బొనిగల హైమారావులు స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ముఖ్యంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్



లోని స్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ లిస్టులను మెరిట్ కం రోస్టర్ విధానం లో కాకుండా పుట్టిన తేదీ ల ప్రకారం సీనియారిటీ లిస్టులను తయారు చేసి గ్రేడ్ -%II% ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు చేపట్టారని, ఎన్ని సార్లు ఉపాధ్యాయులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన వాటిని పరిష్కారం చేయకుండా పదోన్నతులు చేపట్టారని ఈ పదోన్నతులు పై సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులు పై చర్యలు తీసుకోవాలని కోరినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కమిషనర్ ను కోరారు.

## ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం

పెదనందిపాడు మే 30 (లక్ష్యం న్యూస్) .. పెదనందిపాడు శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలతో పాటు శ్రీరాముని జన్మ నక్షత్రం పునర్వసు. సందర్భంగా దాత వెలినేని



మురళి సహకారంతో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం మారుతి శేషసాయి. వేదాంతం ఆత్రేయులు శ్రీ కోదండ రామునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్త భజన సమాజముల వారు. శ్రీరామనామ సప్తాహము నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నూతి శ్రీనివాసరావు . వెలినేని కృష్ణారావుల నేత్రత్వంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# వేతనాలకు ఎదురుచూపులు

పుట్టపర్తి : వేతన బకాయిలు ఏడు వారాలుగా జమ కాకపోవడంతో కూలీలు నానా అగచాట్లు పడుతున్నారు. మండుటెండల్లో పనులు చేస్తున్నా.. సకాలంలో వేతనాలు అందక.. కుటుంబపోషణ భారంగా మారిందని వాపోతున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి హామీ పథకం పైనే ఆధారపడుతున్నారు. జిల్లాలో 2,75,364 జాబ్‌కార్డులు ఉండగా 2.74 మంది కూలీలు పనులు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వారంలోగానే వేతనం అందించాల్సి ఉన్నా అమలు కావడం లేదు. సుమారు రూ.46 కోట్లు కూలీల ఖాతాల్లో



జమ కావాల్సి ఉంది. ఉపాధి హామీ ద్వారా ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లాలో నీటికుంటలు, ఇంకుడుగుంతలు, భూమి చదును, సరిహద్దు, కందకాలు, పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్కో కూలీకి రోజుకు సగటు వేతనం రూ.307గా నిర్ణయించారు. దీంతో కుటుంబమంతా ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఈక్రమంలో వారాల తరబడి చెల్లింపులు నిలిచిపోవడంతో అప్పు చేసి జీవనం సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెల్లింపునకు చర్యలు తీసుకుంటాం విజయప్రసాద్, డ్వామా పీడీ

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు జమ కావాల్సి ఉంది. ఇప్పటికే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. వారంలో బకాయిలన్నీ చెల్లిస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# గుట్ట.. నక్కలు

యర్రావారిపాలెం : కొండలు.. గుట్టలు.. చెరువులను భూబకాసురులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. గ్రావెల్ తరలించాక వాటిని కబ్జా చేయడం వీలైతే విక్రయించడం చేస్తున్నారు. మండలంలోని యల్లమంద పంచాయతీ మర్రిమాకులపల్లె సర్వే నంబరు 692లో సుమారు 300 ఎకరాల్లో కొండలు, గుట్టలు విస్తరించాయి. ఇదే అదనుగా భారీ యంత్రాలు ఉపయోగించి గుట్టలు, కొండలు పిండిచేస్తున్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన తలకోన నెరబైలు పంచాయతీలోనూ ఇదే తీరుగా యంత్రాలతో కబ్జాపర్వం కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో 10 నుంచి 15 ఎకరాల భూములు ఆక్రమిం



చేశారు. తోటిహరిజనవాడకు చెందిన కొందరు గండుగు చెరువును ఆనుకుని ఉన్న పేటిగుట్టను చదునుచేసి ఐదెకరాలు కబ్జా చేశారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

వాల్టా చట్టం మేరకు మట్టి, ఇసుక తరలించడానికి ఎలాంటి అనుమతులు లేవు. ప్రభుత్వ ఆధీనంలోని గుట్టలు, కొండలు, చెరువులు ఆక్రమించిన వారిపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటాం.

పరమేశ్వరస్వామి, తహసీల్దారు, యర్రావారిపాలెం

# గుడివాడ కొండపై 'అనకొండలు'.. అక్రమంగా బ్లాక్ మెటల్ వెలికితీత

చోడవరం : రావికమతం చోడవరం నియోజకవర్గ పరిధిలోని గుడివాడ కొండపై బ్లాక్ మెటల్ తవ్వకాలు నిరాటంకంగా జరుగుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు లేకుండానే యంత్రాలతో మెటల్ తవ్వి వాహనాల్లో యథేచ్ఛగా తరలిస్తున్నారు. సర్వే నంబరు 338-2లోని కొండపై అనధికారిక తవ్వకాలను నెల రోజుల కిందట అధికారులు నిలిపివేయించారు. పొక్లెయిన్‌ను సీజ్ చేసి రూ.50 వేలు జరిమానా విధించారు. ఇటీవల ఆ మొత్తం చెల్లించడంతో పొక్లెయిన్‌ను యజమానికి అప్పగించారు. తాజాగా అదే క్వారీలో ఆదివారం రాత్రి నుంచి అనధికార తవ్వకాలకు తెరలేచింది. బ్లాక్ మెటల్‌ను పేల్చేందుకు డ్రిల్లింగ్ మిషన్లు, జనరేటర్, పీపాల్లో డీజిల్‌ను క్వారీ వద్దకు తరలించి రాత్రికి రాత్రే బ్లాస్టింగ్ చేసి వాహనాల్లో తరలించేందుకు సిద్ధం చేశారు. అనధికార తవ్వకాలపై స్థానికులు గనులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా.. గనుల శాఖ నర్సీపట్నం సహాయ సంచాలకులు శివాజీ, తహసీల్దారు వెంకటరమణ ఆదేశాల మేరకు ఉప తహసీల్దారు అప్పలనాయుడు, వీఆర్ఓలు నారాయణరావు, అప్పారావు, నాగరాజు క్వారీని సందర్శించారు.



అప్పటివరకు తవ్వకాలు జరిపిన వారంతా అధికారులు వస్తున్నట్లు తెలుసుకుని అక్కడ్నుంచి జారుకున్నారు. డ్రిల్లింగ్ మిషన్, జనరేటర్, స్ప్రెయర్లు, డీజిల్ పీపాలను సీజ్ చేసిన గనుల శాఖ అధికారులు ఉప తహసీల్దారు అప్పలనాయుడు, గుడివాడ వీఆర్ఓ నారాయణరావుకు అప్పగించారు.

గనుల శాఖ ఏడీ శివాజీ మాట్లాడుతూ.. 'సర్వే నంబరు 338-2లో 4.95 ఎకరాల విస్తీర్ణంలో బ్లాక్ మెటల్ తవ్వకాలకు 'నెట్ కం ఐటీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్' ఈ-వేలంలో 16.2 లక్షలు చెల్లించి అనుమతి కోరింది. సంబంధిత ధ్రువపత్రాలు, అగ్రిమెంట్లు ఇంత వరకు గనుల శాఖకు అందజేయలేదు. నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు సమర్పించిన తర్వాతే ఈసీ జారీ చేస్తాం. ఈసీ తీసుకున్న తర్వాతే తవ్వకాలకు అనుమతిస్తాం. గుడివాడ కొండపై బ్లాక్ మెటల్ తవ్వకాలకు మైనింగ్ శాఖ ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. ముందస్తు అనుమతుల్లేకుండా తవ్వకాలు జరపడం నేరం. తవ్వకాలకు వినియోగించిన వాహనాలను, యంత్రాలను సీజ్ చేసి రెవెన్యూ సిబ్బందికి అప్పగించా'మని పేర్కొన్నారు.

# చెరువుల్ని పూర్తిగా నింపి, ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడండి : మాజీమంత్రి ప్రత్తిపాటి

**- పట్టణ ప్రజలకు తాగునీరు అందించే చెరువుల్ని పరిశీలించిన ప్రత్తిపాటి**

**- సాగర్ నీటితో చెరువులు నింపి, వృథాలేకుండా ప్రజలకు నీరు అందించాలని అధికారులకు ఆదేశం**





చిలకలూరిపేట టౌన్ మే 30 (లక్ష్యం న్యూస్)::పట్టణ ప్రజలకు తాగునీరు అందించే రెండు మంచినీటి చెరువుల్ని సాగర్ నీటితో పూర్తిగా నింపి, ప్రజలకు నీటిఇబ్బందులు లేకుండా చూడాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అధికారులకు సూచించారు. పట్టణశివారులోని తాగునీటి చెరువుల్లోకి చేస్తున్న నీటి పంపింగ్ ను శుక్రవారం ప్రత్తిపాటి అధికారులతో కలిసి పరిశీలించారు. ఒకట్రెండు రోజుల్లో సాగర్ నుంచి వచ్చే నీటితో చెరువులు సంపూర్ణంగా నిండాలని, నీటి పంపింగ్ లో ఎదురయ్యే సమస్యల్ని త్వరగా అధిగమించాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు. అన్ని మోటార్లు రన్ చేసి త్వరగా చెరువుల్లోకి నీరు వచ్చేలా చూడాలన్నారు. తర్వాత ఆ నీటిని నిత్యం నిర్ణీత సమయానికి ప్రజలకు సక్రమంగా అందించాలన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది చెరువులు నిండుకుండల్లా జలకళను సంతరించుకున్నాయని, నీరు సమృద్ధిగా ఉండటంతో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు ఉండవని ప్రత్తిపాటి చెప్పారు. గత ప్రభుత్వం పట్టణ ప్రజలకు సక్రమంగా తాగునీరు కూడా అందించలేదన్న ప్రత్తిపాటి, కూటమిప్రభుత్వంలో నిత్యం నీటిసరఫరా జరిగేలా అన్నిచర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే నైరుతి ప్రభావంతో వర్షాలు ప్రారంభమై, పై ప్రాంతం నుంచి నాగార్జున సాగర్ కు వరద వస్తోందని, త్వరలోనే సాగర్ ఆయకట్టు రైతులకు సాగునీరు కూడా విడుదల చేయడం జరుగుతుందన్నారు. **నకిలీ విత్తనాలు.. ఎరువులతో రైతుల్ని మోసగించేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోండి...**

తొలకరి వానలు మొదలవడంతో రైతులు సాగుపనుల్లో నిమగ్నమయ్యారని, ఖరీఫ్ ప్రారంభం దృష్ట్యా వ్యవసాయ అధికారులు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రత్తిపాటి సూచించారు. విత్తనాలు, ఎరువులు సరిపడినన్ని అందుబాటులో ఉంచడమేగాక, సకాంలో అవి రైతులకు అందించాల్సిన బాధ్యత అధికారులదేనని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. నకిలీ విత్తనాల తయారీ.. అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతుల్ని మోసగించి లాభపడదామనుకునే వారి ఆటకట్టించాలని ప్రత్తిపాటి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. విత్తన, ఎరువుల వ్యాపారం చేసేవారిపై పూర్తి నిఘా ఉంచాలని, నకిలీవి అంటగట్టి రైతుల్ని మోసగించేవారిని చట్టపరంగా శిక్షించాలని ప్రత్తిపాటి ఆదేశించారు. చెరువుల పరిశీలనకు వెళ్లిన ప్రత్తిపాటి వెంట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, జవ్వాజి మధన్ మోహన్, మద్దుమల రవి, జంగా వినాయకరావు, జంగా సుజాత, తుపాకుల అప్పారావు తదితరులున్నారు.

# మహానాడులో అభివృద్ధికి శాసనం లిఖించారు

**ఆరు శాసనాలు ద్వారా రాష్ట్ర ప్రగతికి బాటలు**

**మహానాడు చరిత్రలోనే సువర్ణ లిఖితం**

**ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టించాం**

**మహానాడుకు విచ్చేసిన నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు : గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు మే 30 (లక్ష్యం ప్రతినిధి)నిన్నటికి రేపటికి వారధిగా మహానాడు నిలిచిందని, దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో నసీర్ మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ప్రస్తుత ప్రజా మార్పునకు అనుగుణంగా పని చేస్తోందని తెలిపారు. ఇలాంటి చారిత్రాత్మకమైన కార్యక్రమంలో ద్వారా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో నూతనత్తేజం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆలోచనలే తెలుగుదేశం పార్టీ విధానాలుగా ప్రజాక్షేత్రంలో వెళుతున్నామన్నారు. యువకుల సమ్మేళనం సీనియర్ల సూచనలతో పార్టీ అజేయశక్తిగా ఎదిగిందన్నారు. మెడపై కత్తి పెట్టి జై జగన్ అనమంటే జై చంద్రబాబు అని నినదించిన చంద్రయ్య లాంటి కార్యకర్తలే పార్టీకి బలమని పేర్కొన్నారు.ప్రధానంగా నాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రజా మార్పునకు శాసనం తీసుకొస్తే నేడు ఆరు శాసనాలు ద్వారా యువ నాయకులు నారా లోకేష్ అభివృద్ధికి శాసనం లిఖించేశారు.నసీర్ తెలిపారు. ఈ శాసనాల ద్వారా యువతకు గొప్ప భవిత రానుందని పేర్కొన్నారు. మహానాడుకు పోటెత్తిన పసుపు వర్ణాన్ని చూస్తే ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టిందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా నారా లోకేష్ పాదయాత్ర చేపట్టి తెలుగుదేశం క్యాడర్లో ఉత్సాహం నింపారని పేర్కొన్నారు సహకరిస్తే పాదయాత్ర లేకపోతే దండయాత్ర అంటూ పార్టీని ముందుకు నడిపించారని గుర్తు చేశారు ఇప్పుడు యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నారని వివరించారు. ఇలాంటి నాయకత్వంలో రాష్ట్ర ప్రగతి మరింత ముందుకి వెళుతుందని చెప్పారు. తెలుగుదేశం స్త్రీ శక్తిని ప్రోత్సహించడంలో ముందుందని ఆయన గుర్తు చేశారు. చట్టసభల్లో మహిళలకు అవకాశాలు కల్పించారని తెలిపారు. కడపలో నిర్వహించిన మహానాడుకు గుంటూరు నుంచి విచ్చేసిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. మహానాడు ఉత్సాహంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా వెల్లడించారు.

# యోగాతో ఆరోగ్య, ఆత్మశుద్ధి

**1 నుంచి ఎమ్మెల్యే కార్యాలయంలో ఉచిత యోగా తరగతులు**

**యోగాంధ్ర ప్రదేశ్ సాధనలో భాగమవుదాం : గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు మే 30 (లక్ష్యం ప్రతినిధి)యోగాతో ఆరోగ్యంతోపాటు హృదయ శుద్ధి కలుగుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.శుక్రవారం గుంటూరు తూర్పు శాసనసభ్యులు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు.

యోగా ఆంధ్ర ప్రదేశ్ 2025లో భాగమవుతున్నామని తెలిపారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు రెండు కోట్ల మందితో జూన్ 21వ తేదీన యోగా నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ మేరకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాల యంలో 1వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగ తరగతులు చేపట్టనున్నామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యోగా అంటే కేవలం ఆసనాలు మాత్రమే కాదని మన జీవితాల్లో మెరుగుపరిచే గొప్ప ఆయుధమని తెలిపారు యోగా ద్వారా అంతఃకరణ శుద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యోగా గురువు జుజ్జురి శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగాతో కేవలం ఆరోగ్యమే కాదని మన జీవన సరళి మారుతుందని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రతి రోజు శిక్షణ అందిస్తామని వెల్లడించారు. అనంతరం యోగాంధ్రప్రదేశ్ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు.

# చేతుల్లో వలలు.. కళ్లల్లో కలలు!!

విశాఖ : విశాఖ చేపలరేవులో నవీకరణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇంకా జెట్టీల ఆధునికీకరణ ప్రారంభం కాలేదు. ప్రస్తుతం మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు, తాగునీటి ట్యాంకర్లు, రహదారులు, వేలం పాట షెడ్డు, వలల అల్లిక కేంద్రం, శీతల గిడ్డంగుల పనులు కొనసాగుతూ ఉన్నాయి. ఇంకొన్ని నిర్మాణాలు తొలి దశలోనే ఉన్నాయి. నిర్ణీత గడువు ముగిసే: 2023 ఆగస్టు నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పనులు ప్రారంభమైన నాటి నుంచి ఏడాది లోపు పూర్తి చేయాలని గడువు నిర్ణయించారు. అలా గతేడాది నవంబరు నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా, ఇప్పటికీ పూర్తి కాలేదు. ఆయా నిర్మాణాలకు మొత్తం రూ.162 కోట్లు కేటాయించారు. గుత్తేదారుల నిర్లక్ష్యంతోనే పనులు సాగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని పనులు 70 నుంచి 80 శాతం పూర్తయితే, మరికొన్ని పునాది దశ దాటలేదు.వచ్చే జూన్ 15 నుంచి చేపల వేట సీజన్ ప్రారంభం కానుంది. అయితే జూన్ 10వ తేదీ నుంచే జెట్టీల్లో మత్స్యకారుల హడావుడి కనిపిస్తుంది. బోటుల్లో ఐస్ నిల్వ చేసుకోవడం, ఇంధనం నింపడం, వేట సమయంలో వంటకు అవసరమయ్యే నిత్యావసరాలు భద్రపరు చుకోవడం చేస్తారు. ఆ లోపు నవీకరణ పనులు పూర్తయితే బాగుండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని మత్స్యకార వర్గాలు చెబుతున్నాయి.

**మరో పది నెలలు కష్టమే:** ఒక్కసారి సీజన్ ప్రారంభమైతే... పది నెలల పాటు ఏకధాటిగా వేట సాగుతుంది. మత్స్య సంపద ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలతో చేపలరేవు జెట్టీలు నిత్యం రద్దీగానే ఉంటాయి. ఆ సమయంలో నవీకరణ పనులు ముందుకు సాగే పరిస్థితి ఉండదు. పనుల్లో భాగంగా అదనంగా మరో ఫింగర్ జెట్టీ నిర్మాణం ప్రారంభించారు. ఆ పనులు అసంపూర్తిగానే ఉండడంతో, అది కూడా ప్రస్తుత సీజన్‌కు అందుబాటులోకి రాకపోవచ్చు.

**పరిసరాలు అస్తవ్యస్తం..:** నవీకరణ పనుల నేపథ్యంలో కొన్ని నెలల నుంచి చేపలరేవు పరిసరాలు అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు నిల్వ ఉంటూ తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. నిధులున్నా.. పనులు సాగకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

# తీరంలో.. 'తోడే'ళ్లు!

విశాఖపట్నం : విశాఖ తీరంలో నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘించి సముద్ర పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. సీఆర్‌జడ్ (తీర నియంత్రణ మండలి) నిబంధనల ప్రకారం తీరంలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదు. భూగర్భ జలాలను వెలికితీసి వాణిజ్య అవసరాలకు వినియోగించకూడదు. ఆర్కేబీచ్‌లో ఆ నిషేధాజ్ఞలు గాలికి కొట్టుకుపోయాయి. కార్లు, ద్విచక్రవాహనాల సర్వీసింగ్ కేంద్రాలు భూగర్భ జలాలను వెలికి తీసి బహిరంగంగా వాడుతున్నా, శాశ్వతంగా హోటల్ నిర్మించినా పట్టించుకునేవారు కరవయ్యారు.

**120అడుగుల లోతుకు బోర్లు:** అప్పుఘర్, ఎంవీపీకాలనీ డబుల్‌రోడ్డు, శివగణేష్‌నగర్, వాసవానిపాలెం, జాలరిఎండాడ, లాసన్స్‌బేకాలనీ తదితర ప్రాంతాల్లోని పలు సర్వీసింగ్ కేంద్రాల్లో సుమారు 100అడుగుల నుంచి 120 అడుగుల మేర తవ్వకాలు చేపట్టి బోర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం ఒక్కో చోట వేలాది లీటర్ల నీటిని తోడేస్తున్నారు. అదే విధంగా గోకుల్‌పార్కు సమీపంలో ఓ రెస్టారెంట్ నిర్మించారు. అనధికారికంగా నీటి తోడకంపై గతంలో పర్యావరణ వేత్తలు, సామాజిక వేత్తలు, మత్స్యకారులు ఆందోళన చేపడితే జీవీఎంసీ



అధికారులు మోటార్లను సీజ్ చేశారు. తర్వాత పట్టించుకోకపోడంతో మళ్లీ పూర్వ స్థితికి చేరుకుంది.

**చమురు వ్యర్థాలు నేరుగా తీరంలోకి.:** సర్వీసింగ్ కేంద్రాల్లో కార్లు, ద్విచక్రవాహనాలను శుభ్రం చేయగా వచ్చిన చమురు వ్యర్థాలను సముద్రంలోకి నేరుగా విడిచిపెడుతున్నారు. దీంతో సముద్ర పర్యావరణం దెబ్బతిని మత్స్యసంపదకు నష్టం వాటిల్లుతోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో తీరంలో దుకాణాలకు అనుమతులు ఇవ్వడంతో పర్యావరణవేత్తలు కోర్టును ఆశ్రయించారు. దుకాణాలను వెంటనే తొలగించాలని నాడు కోర్టు తీర్పు ఇచ్చింది. ఇదే సూత్రం గ్యారేజీలు, వాహనాల సర్వీసింగ్ కేంద్రాలకు వర్తిస్తుందనే విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు.

**500మీటర్ల వరకు పూర్తిగా నిషిద్ధం:** కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ జారీ చేసిన సీఆర్‌జడ్ నోటిఫికేషన్లు 1991, 2011 ప్రకారం.. సముద్రపు పోటు నుంచి 500 మీటర్ల వరకు భూగర్భ జలాల వెలికితీత పూర్తిగా నిషిద్ధం. సమీపంలోని మత్స్యకార గ్రామాల్లో నీటి వనరులు అందుబాటులో లేకపోతే కేవలం తాగునీటి కోసం 200 నుంచి 500 మీటర్ల జోన్‌లో బోర్లకు అనుమతించవచ్చు.

ఈ ప్రాంతంలో నీటిని తోడాలంటే వాల్టా చట్టం ప్రకారం రెవెన్యూ అధికారుల నుంచి, సీఆర్‌జడ్ నిబంధనల ప్రకారం కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. విశాఖ తీరంలో ఈ అనుమతులు లేకుండా మోటార్ల సహాయంతో నిత్యం వేలాది లీటర్ల నీటిని తోడేస్తున్నారు.

# మరింత మెరుగ్గా 108 సేవలు

ఎలమంచిలి : కూటమి ప్రభుత్వం చొరవతో 108 సేవలు మెరుగుపడనున్నాయి. జూన్ నుంచి నిర్వహణ బాధ్యతలను భవ్య సంస్థ చేపట్టనుంది. జగన్ పాలనలో 108 వాహనాల సిబ్బందికి జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కొత్తగా ఈ బాధ్యతలను భవ్య సంస్థకు అప్పగించడంతోపాటు పాత వాహనాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి సమకూర్చాలని నిర్ణయించింది. పాత వాహనాలను ఈ నెలాఖరుకు విజయవాడ తరలించి అక్కడ అప్పగిస్తారు. ప్రభుత్వం వీటి స్థానంలో కొత్త వాహనాలను అందిస్తుంది. జిల్లాలో 22 వాహనాలు ఉన్నాయి. వీటిలో 60 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి వాహనానికి ఒక పైలట్, ఒక టెక్నీషియన్ ఉంటారు. వీరు సెలవుపెట్టిన రోజు పని చేయడానికి మరొకరు ఉంటారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో 12, నర్సీపట్నం డివిజన్‌లో 10 వాహనాలు సేవలందిస్తున్నాయి. వీటిలో సగానికి పైగా వాహనాలను మార్చాల్సి ఉంది. వాస్తవానికి 108 వాహనాలకు రోజుకు రూ. 5 వేల వరకూ ఇంధనం ఖర్చు చేయడానికి అనుమతి ఉండేది. ఈ పరిమితిని రూ. 2 వేలకు తగ్గించడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

# కర్షకా..పారించకు రసాయనాల ధార

కరీంనగర్ : అధిక దిగుబడులకు ఆశపడి అన్నదాతలు ఎక్కువ మొత్తంలో రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో నేలలో సారం తగ్గిపోతుంది. విచ్చలవిడిగా ఎరువుల వినియోగంతో ఆహారం విషతుల్యమై మానవుల ఆరోగ్యం దెబ్బతింటుంది. వీటిని అరికట్టాడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహిస్తున్నా.. రైతుల్లో మార్పు రావట్లేదు. మోతాదుకు మించి నత్రజని వినియోగిస్తే భూమి నిస్సారంగా మారుతుంది. మనుషుల్లో క్యాన్సర్ లాంటి వ్యాధులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. రైతుల ఆలోచన విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కాలుష్యానికి దోహదం**

పంటలపై రసాయన ఎరువుల వాడకంతో నీటి కాలుష్యం ఏర్పడుతుంది. నీటిలో ప్రాణవాయువు పరిమాణం తగ్గిపోతుంది. ఆ నీటిలో ఉండే జీవరాశులు క్రమేణా నశించిపోతాయి. వాయు కాలుష్యం ఏర్పడి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేలలో సేంద్రియ పదార్థం కోల్పోయి నేలలో ఆమ్లత్వం పెరుగుతుంది. జీవ వైవిధ్యం దెబ్బతింటుంది.

**భారీగా పెరిగిన వినియోగం**



జిల్లాలో 2023-24, 2024-25 సంవత్సరానికి సంబంధించి వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో కలిపి ఏకంగా 1,62,282 మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగించారు. ఇది సాధారణ వినియోగం కన్నా చాలా ఎక్కువ అని వ్యవసాయ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సాధారణ నేలలో అయితే నత్రజని(ఎన్), భాస్వరం(పీ), పొటాషియం(కే)లను 4:2:1 నిష్పత్తిలో ఎరువులను వినియోగించాలి. ఒక ఎకరానికి సుమారుగా రెండున్నర సంచుల యూరియా, ఒక సంచి డీఏపీ, ఒకటిన్నర సంచి కాంప్లెక్స్ ఎరువులు వాడాలి.

**అవగాహన కల్పిస్తున్నాం**జిల్లాలో రసాయన ఎరువుల వినియోగం భారీగా పెరిగింది. అంచనాల కు మించి రైతులు యూరియా వినియోగిస్తున్నారు. మోతాదుకు మించి వాడకంతో భూమి, నీరు, వాయు కాలుష్యం దెబ్బతిని అంతిమంగా పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుంది. మనుషుల్లో సైతం క్యాన్సర్ జబ్బులు పెరుగుతాయి. ఈ అనర్థాలపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

# ఎస్ఆర్వోల ఏర్పాటు ఎన్నడో?

రాయికల్ : జిల్లాలోని బుగ్గారం మండలంలో ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించిన సమయంలో ధర్మపురిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్ఆర్వో) ఏర్పాటు చేయాలని జిల్లా నేతలు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లాలోని అయిదు పట్టణాలకు మూడు పట్టణాల్లో కార్యాలయాలు ఉండగా ధర్మపురి, రాయికల్‌లో లేవు. దీంతో జగిత్యాలకు వెళ్లాల్సి వస్తోంది.

**రవాణా భారం**

జగిత్యాల జిల్లాలో 20 మండలాలు, అయిదు పురపాలికలు ఉన్నాయి. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మల్యాలలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండటంతో ఆయా కార్యాలయాల పరిధిలో నిత్యం వ్యవసాయేతర, భూములు, భవన, వివాహ రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు భూ భారతి చట్టం ద్వారా అన్ని మండల కేంద్రాల్లో చేస్తున్నారు. కానీ వ్యవసాయేతర రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉన్న పట్టణాలకు వెళ్లాల్సి రావడంతో దరఖాస్తుదారులకు రవాణా భారం తప్పడం లేదు. మెట్‌పల్లి కార్యాలయ పరిధిలో మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాలు.. కోరుట్ల పరిధిలో కోరుట్ల, మేడిపల్లి, బీమారం, కథలాపూర్ మండలాలు.. మల్యాల పరిధిలో మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాలు.. జగిత్యాల పరిధిలో అధికంగా 8 మండలాలు జగిత్యాల, జగిత్యాల రూరల్, సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్, బుగ్గారం, ధర్మపురి, వెల్గటూరు, ఎండపల్లి మండలాలకు సేవలు అందిస్తున్నాయి.

పలు మండలాలు ఆయా పట్టణాలకు సుమారు 20 కి.మీ.ల నుంచి 35 కి.మీ.ల దూరంలో ఉండటం, ఒక్కోసారి సాంకేతిక లోపాలతో రెండు, మూడు సార్లు రావాల్సి వస్తుండటంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన పురపాలికలుగా ఏర్పడిన ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించాలని కోరుతున్నారు.

**ఆదాయం వచ్చినా..**

రాయికల్ పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో 2018లో పైలట్ ప్రాజెక్టులో భాగంగా వ్యవసాయేతర భూముల కొనుగోళ్లను ప్రభుత్వం ప్రారంభించగా రెండేళ్లు రిజిస్ట్రేషన్లు నిర్వహించారు. ఏటా 1520 రిజిస్ట్రేషన్లు, 420 వివాహాలు నమోదు చేయగా రూ.2 కోట్ల ఆదాయం వచ్చింది. మళ్లీ ప్రభుత్వం ఆ సేవలు నిలిపివేసి జగిత్యాలకు తరలించింది. మండలవాసులకు సేవలు దూరమవడంతో పలుమార్లు ఆందోళనలు చేపట్టి వినతిపత్రాలను అందజేశారు.

## వాహనాలు ఇలా.. పారిశుద్ధ్య నిర్వహణ ఎలా?

సిరిసిల్ల : ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. వరద ముంపు పొంచిఉన్న నేపథ్యంలో మురుగుకాల్వల్లో పేరుకుపోయిన పూడిక తొలగించాల్సి ఉంది. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా చూడాలి. ఇళ్ల నుంచి చెత్తను సేకరించాలి. ఇలా ఒకటేమిటి పురపాలికల్లో 62 అంశాలతో వంద రోజుల ప్రణాళిక అమలుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. జూన్-2 నుంచి సెప్టెంబరు-9 వరకు ఈ కార్యక్రమాలు చేపట్టాలి. ఈ పనులన్నీ చేయాలంటే పురపాలికల్లో పారిశుద్ధ్య సిబ్బందితోపాటు వాహనాలు బాగుండాలి. కాగా కనీస నిర్వహణ లేక వాహనాలు ఒక్కొక్కటిగా మూలకు చేరుతున్నాయి. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో చెత్తసేకరణకు 84 వాహనాలున్నాయి. వీటిలో 15 వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. మరికొన్ని పూర్తిగా పనిచేయడంలేదు. సిరిసిల్ల పురపాలికలో పొక్లెయిన్ పనిచేయడంలేదు. దీని ప్రభావం పారిశుద్ధ్య నిర్వహణపై పడుతోంది. **మరమ్మతుల కేంద్రంలేక..**

జిల్లాలోని రెండు పురపాలికల్లో పారిశుద్ధ్య వాహనాల నిర్వహణకు ప్రతి నెలా రూ.3 లక్షలు ఖర్చవుతోంది. వీటిని సాధారణ నిధుల నుంచి వినియోగించాలి. ప్రస్తుతం రెండు పురపాలికల్లోనూ నిధుల కొరత ఉంది. దీంతో వాహనాల నిర్వహణ భారంగా మారుతోంది.రెండు పురపాలికల్లో అన్ని రకాల పారిశుద్ధ్య వాహనాలు కలిపి వందకుపైగా ఉన్నా.. వాటిని వినియోగించడం మినహా కనీస నిర్వహణ లేదు.అయిల్ మార్చడం, గ్రీసింగ్, టైర్లలో గాలి వంటివాటితో పాటు చిన్నపాటి మరమ్మతులు సైతం చేసుకునేలా కేంద్రం ఉండాలి. వాహనాలు నడిచినన్ని రోజులు నడిపించి మొరాయించగానే పక్కన పెట్టేస్తున్నారు.మరమ్మతులకు గురైన వాహనాలు పెరిగినప్పుడు ఆన్‌లైన్‌లో టెండర్లకు వెళ్తున్నారు.

# దారికి రావు.. దరి చేరవు



హైదరాబాద్ : నగరంలో రద్దీ ప్రాంతాల్లో పాదచారులు రోడ్డు దాటాలంటే గుండె దిటవు చేసుకోవాల్సిందే. రోడ్డు దాటేందుకు అనుకూల సౌకర్యాలు లేక పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో చాలా చోట్ల పాదచారుల వంతెనలు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసినా కొన్ని కార్యాచరణకు నోచుకోలేదు. మరోవైపు నిర్మాణం పూర్తయినవి అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి.హైటెక్‌సిటీలోని పలు పర్యాటక ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు చాలాకాలంగా డిమాండ్లున్నాయి. ముఖ్యంగా కొత్తగూడలోని బొటానికల్‌గార్డెన్, మాదాపూర్‌లోని శిల్పారామం ఎదుట వీటి అవసరం ఎక్కువగా ఉంది. కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌కు నిత్యం సందర్శకులతోపాటు వందలాది మంది వాకింగ్‌కు వస్తుంటారు. సందర్శకులు తమ వాహనాలను ప్రధాన గేటు ఎదురుగా రోడ్డు అవతలి వైపు నిలపాల్సి ఉంటుంది. విశాలంగా ఉండే ఈ రోడ్డు దాటే క్రమంలో వాహనాలు ఢీకొని గాయాలపాలవుతున్నారు.

జీహెచ్ఎంసీ నాలుగేళ్ల క్రితం ఇక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసింది. 220కేవీ విద్యుత్ తీగలు ఉండటంతో అది కార్యరూపం దాల్చలేదు. వాకర్స్ విజ్ఞప్తి మేరకు మరో చోట నిర్మించే అంశాన్ని పరిశీలిస్తామన్న అధికారులు ఆ తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. పాదచారులు రోడ్డు దాటేందుకు ప్రత్యేకంగా సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేసినా అది సక్రమంగా పనిచేయడం లేదు.

శిల్పారామం వద్ద ఇదే పరిస్థితి. జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి వైపు వెళ్లే సందర్శకులు కచ్చితంగా రోడ్డు దాటాల్సి ఉంటుంది.

కొండాపూర్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డు దాటడం రోగులకు కష్టతరంగా మారింది. ఇక్కడున్న యూటర్న్‌ను ట్రాఫిక్ పోలీసులు మూసివేసి దిమ్మెలు ఏర్పాటు చేశారు.

ఏడాదైనా ఆరంభమే కాలేదు..

రాయదుర్గం మల్కం చెరువు వద్ద రూ.కోటితో పాదచారుల వంతెన నిర్మించారు. మూడేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించారు. ఆది నుంచీ పనులు నత్తనడకన సాగి ఏడాది కిందట దాదాపు నిర్మాణం పూర్తయ్యింది. రెండు వైపులా ఎస్కలేటర్‌లు, లిఫ్టులూ బిగించారు. వంతెన చెంత ఫ్లోరింగ్, ఎస్కలేటర్లు, లిఫ్టలకు విద్యుత్ కనెక్షన్ పనులు మిగిలి ఉన్నాయి. ఆరు నెలలుగా ఆ పనులు చేపట్టకుండా తాత్సారం చేస్తున్నారు.

**అమీర్‌పేటలో ఏడేళ్లుగా..**

అమీర్‌పేట కమ్మసంఘం, ఆర్ఎస్ బ్రదర్స్, అమీర్‌పేట కూడలిలో రోడ్డు దాటడం చాలా కష్టం. మెట్రో కారిడార్ నిర్మాణం అనంతరం పిల్లర్లను కలుపుతూ రహదారి విభాగినులు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రోడ్డు దాటడం మరింత ఇబ్బందిగా మారింది. అమీర్‌పేట చౌరస్తా నుంచి కమ్మసంఘం వరకు ఎక్కడా రోడ్డు దాటే అవకాశంలేదు. కమ్మసంఘం హాల్ ముందున్న యూటర్న్ వరకు నడిచి రోడ్డు దాటాల్సిందే. ఈ సమస్య నివారించడానికి జీహెచ్ఎంసీ అధికారులు చర్మాస్, ఆర్ఎస్‌బ్రదర్స్ షోరూంల వద్ద పాదచారుల వంతెనకోసం ఏడేళ్లకిందట పనులు ప్రారంభించి అర్ధంతరంగా నిలిపివేశారు. స్థానికంగా ఓ షోరూం వారు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయని జీహెచ్ఎంసీ అధికారి తెలిపారు.

**అవసరం లేని చోట నిర్మించి..**

వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్-రామంతాపూర్ మార్గంలో ఉప్పల్ ఐడీఏలో రూ.3 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మూడేళ్ల క్రితం నిర్మించారు. నిధుల వృథా తప్ప ఎవరూ ఈ వంతెనను ఎక్కి రోడ్డు దాటేందుకు ఇష్టపడటం లేదు. వంతెన నిర్మించిన చోట ట్రాఫిక్ పెద్దగా ఉండకపోవడమే కారణం. వాస్తవానికి ఈ వంతెన రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్) ప్రాంతంలో నిర్మించాల్సిందిగా ప్రతిపాదనలు చేశారు. ఎవరికీ అవసరం లేని చోట నిర్మించి నిధులు దుర్వినియోగం చేశారు.

# శిలాజాలు.. చారిత్రక ఆనవాళ్లు



హైదరాబాద్ :తెలంగాణ చరితే కాదూ.. యావత్ ప్రపంచ చరిత్ర ప్రాచీనతను తెలియజెప్పే సజీవ సాక్ష్యాలు 'శిలాజాలు'(ఫాజిల్స్). మానవుడు పుట్టకముందు భూమిపై సంచరించిన రాక్షస బల్లులు (డైనోసార్లు), ఇంకా మరెన్నో పూర్వకాలపు జీవులు, అప్పటి పరిస్థితుల గురించి శిలాజాల ద్వారానే ఎన్నో విశేషాలు తెలిశాయి. చాలామంది శిలాజం అంటే మనకు సంబంధం లేని విషయం అనుకుంటారు. కానీ లక్షల ఏళ్ల క్రితం బతికిన, ఇప్పుడున్న మనం ఎప్పటికీ చూడలేని జీవుల ఆకారం, వాటి ఆహారం, ఇంకా ఎన్నో విశేషాలను ఈ రోజు మనం తెలుసుకుంటున్నామంటే అది ఫాజిల్స్ వల్లే సాధ్యమైంది. ఫాజిల్ మ్యాన్ ఆఫ్ తెలంగాణగా పేరొందిన యువశాస్త్రవేత్త సముద్రాల సునీల్ మంచిర్యాల జిల్లా సంపుటం గ్రామంలో పరిశోధన చేస్తుండగా తవ్వకాల్లో దొరికిన చెట్టు కాండం, కొమ్మలకు సంబంధించిన 'శిలాజాలు' ప్రస్తుతం రవీంద్రభారతి కారిడార్‌లో భద్రపరిచారు.

**ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిందే..**

అప్పట్లో ఇప్పుడున్న ఖండాలు లేవు. ఆ తర్వాత భూమి లోపల జరిగిన అంతర్గత పరిణామాల వల్ల విభజన ఏర్పడింది. తొలి రోజుల్లో తెలంగాణను గోండ్వానా ల్యాండ్ అనేవారట. ఈ ప్రదేశంలో 20కోట్ల ఏళ్లక్రితమే చెట్లున్నాయని చెప్పడానికి ఆనవాళ్లుగా మిగిలినవి శిలాజాలు. ఇవి రవీంద్రభారతిలో ఎందుకు పెట్టారంటే చాలామంది తెలంగాణలో కరవుందని, పంటలు ఎలా పండించాలో తామే నేర్పించామని చెబుతుంటారు. అలాంటి వారికి కోట్ల ఏళ్ల క్రితమే ఈ నేల పచ్చని చెట్లతో పరిఢవిల్లింది అని చెప్పడానికే ఇదొక సూచిక. నగరంలోని బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లో మనకు కనిపించే డైనోసార్ కూడా ఇదే మంచిర్యాల జిల్లా వేమనపల్లిలో దొరికింది. అది 6 కోట్ల సంవత్సరాల నాటిది. తెలంగాణకు గొప్పచరిత్ర ఉందని చెప్పడానికి ఆధారం ఇది.

**ప్రాచీనత లెక్కించి..**

చెట్లు, జంతువులు, మానవులు మరణించిన తరువాత భూమిలో విస్తాపన చెందినప్పుడు అణువణువు కరిగిపోతుంది. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో నిక్షిప్తమై శిలాజాలుగా మిగిలిపోతాయి. ఆ శిలాజం వయసును బట్టి ప్రాచీనతను నిర్ధారిస్తారు. తెలంగాణకు 20 కోట్ల సంవత్సరాల ఘన చరిత్ర ఉందని చెప్పడానికి నిలువెత్తు సాక్ష్యం రవీంద్రభారతిలో ఉన్న శిలాజాలు అని వివరిస్తున్నారు రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకుడు పరిశోధకుడు మామిడి హరికృష్ణ.

# అదను దాటితే అన్నదాతకు నష్టం



ధర్మారం : ఎంతటి వర్షాభావ పరిస్థితుల్లోనూ నందిమేడారం జలాశయం ఎండిపోయిన సందర్భాలు లేవు. అరకొర వర్షాలు కురిసినా రెండు పంటలకు సరిపడా సాగునీరందిస్తోంది. ఈ జలాశయం నుంచి నందిమేడారం శివారులోని 593.09 ఎకరాలకు సాగునీరందుతోంది. ధర్మారం మండలంతో పాటు వెల్గటూరు, ఎండపల్లి, పాలకుర్తి మండలాల్లోని వేలాది ఎకరాలకు జీవనాధారంగా ఉంటోంది. అయితే జలాశయంలో నిండా నీళ్లున్నా అదనులో పంటలు సాగు చేయకపోవడంతో ఆశించిన దిగుబడులు రావడం లేదు.దశాబ్దం క్రితం వరకు రోహిణి కార్తెలో నార్లు పోసుకునేందుకు వీలుగా నీటిని వదిలేవారు. ఆ తర్వాత ఏటా ఆలస్యంగా వదులుతున్నారు. నాలుగేళ్లుగా ఆగస్టులో వరి నార్లు పోస్తున్నారు. చాలా మంది రైతులు ఇంటి అవసరాల కోసం దీర్ఘకాలిక సన్న రకాలు సాగు చేస్తుండటంతో డిసెంబరు వరకు పంట కోతకు వస్తోంది. మళ్లీ జనవరిలో యాసంగి పంటకు సాగునీరు విడుదల చేస్తుండగా నాట్లు పూర్తయ్యేసరికి వేసవి వస్తోంది. కోతలు పూర్తయ్యేసరికి వర్షాకాలం మొదలవుతోంది. ఈ నేపథ్యంలో వానాకాలం పంటకు రోహిణి కార్తెలో నీటిని విడుదల చేస్తే జులై మొదటి వారం నాటికి వరి నాట్లు పూర్తయి, వాతావరణం అనుకూలించనుంది. ఇటీవల యాసంగిలో జిల్లాలో వరిలో ఎకరాకు 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి రాగా, నందిమేడారం చెరువు ఆయకట్టులో 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు మాత్రమే నమోదైంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తే రైతులకు ప్రయోజనం కలగనుంది.**ఆలస్యమైతే పెట్టుబడుల భారం**

ఆలస్యంగా నార్లు పోస్తే తెగుళ్లు, చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. సస్యరక్షణకు ఖర్చులు పెరుగుతాయి. దీర్ఘకాలిక రకాల సాగుకు జూన్‌లో నారు పోసి జులై మొదటి వారంలోగా నాట్లు వేస్తే మంచి దిగుబడికి అవకాశం ఉటుంది. నాట్లు ఆలస్యమైతే పొట్ట దశకు వచ్చేసరికి చలి తీవ్రతతో గొలక బయటకు రాదు. పూత సరిగా రాక తాలు ఎక్కువై దిగుబడి తగ్గుతుంది.డా.టి.వినోద్‌కుమార్, వ్యవసాయ శాస్త్రవేత్త, రామగిరి కేవీకే

**రైతులకు అవగాహన కల్పిస్తాం** రెండు పంటలకూ నీళ్లందే అవకాశం ఉన్నప్పుడు వానాకాలంలో సాగు ఆలస్యమైతే ఆ ప్రభావం యాసంగిపై పడుతుంది. వరి సాగు ఆలస్యమయ్యే కొద్దీ అందుకు తగిన రకాలు మాత్రమే ఎంచుకోవాలి. దీర్ఘకాలిక రకాలను ఆలస్యంగా సాగు చేస్తే దిగుబడి రాదు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నందిమేడారం రైతులకు అవగాహన కల్పిస్తాం.

# వానొస్తే వణుకే..!

కోరుట్ల : కోరుట్ల పట్టణంలో కురిసిన చిన్నపాటి వర్షానికే లోతట్టు కాలనీలు జలమయమవుతుండగా.. వర్షాకాలంలో వరద ముప్పు ఎంత తీవ్రంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో కురిసిన వర్షానికి ప్రకాశంరోడ్‌లోని కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన మురుగు కాలువ పొంగి వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. వరద నీరు రోడ్లపై పారడంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రాని పరిస్థితులు నెలకొన్నాయని బాధితులు తెలిపారు. వేసవిలో ఒక్కసారిగా కురిసిన వర్షానికే రోడ్లపై వరద నీరు ప్రవహించడంతో రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తనున్నట్లు వాపోయారు. ఏటా ప్రకాశంరోడ్, ఆదర్శనగర్, ముత్యాలవాడలోని కాలనీలు జలమయమవుతూ స్థానికుల్లో వణుకు పుట్టిస్తున్నాయి.

**ఆక్రమణలే అసలు కారణం**

కోరుట్ల పట్టణంలో ప్రధానంగా మద్దుల చెరువు మత్తడి దూకిన వరద నీరు ఫుల్‌వాగులో కలిసేందుకు గతంలో సుమారు 10-15 అడుగుల



వెడల్పుతో కాలువ ఉండేది. ఆ కాలువ పట్టా భూముల్లోంచి ఉండటంతో ఇరువైపులా స్థిరాస్తి వ్యాపారులు కాలువను ఆక్రమించారు. కాలువ భూమిలో పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, కొన్నిచోట్ల రోడ్డును నిర్మించారు. దీంతో పెద్దకాలువ కాస్తా మూడు, నాలుగు అడుగులకు తగ్గింది. మద్దుల చెరువు పైప్రాంతంలో చాలాకాలనీలు ఏర్పడటంతో చిన్నపాటి వర్షానికి చెరువు పూర్తిగా నిండి మత్తడి దూకుతుంది. ఈ నీటితోపాటు తిలక్‌రోడ్, గాంధీరోడ్, ముత్యలవాడ, గోదాం ఏరియా, అయిలాపూర్ నుంచి వచ్చే నీరంతా కేవలం ప్రకాశం రోడ్‌లోని ప్రధాన మురుగు కాలువ గుండా మాత్రమే వెళ్తుంది.

పైప్రాంతం నుంచి వచ్చే వరద వెళ్లేందుకు ప్రకాశంరోడ్‌లో కాలువలు లేకపోవడంతో పదుల సంఖ్యలో రోడ్లు జలమయమవుతున్నాయి. ఇళ్లలోకి వరద చేరుతోంది. ఏటా వరదలు ముంచెత్తుతుండటంతో ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే, పురపాలక సంఘ అధికారులు సందర్శించి వెళ్లడమే తప్ప శాశ్వత చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తగిన చర్యలు తీసుకుంటాం

వరద ప్రాంతాల్లో పురపాలక ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నాం. మురుగు కాలువలను పూర్తిగా శుభ్రం చేయించి వరద నీరు వెళ్లేలా చూస్తున్నాం. భారీ వర్షాల సమయంలో కాలనీలు జలమయమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. లోతట్టు ప్రాంతాల్లో వరదల నివారణ కోసం ఉన్నత అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నాం.మారుతిప్రసాద్, మున్సిపల్ కమిషనర్

# బల్దియాలో చెల్లుతాయట.. డివిజన్లలో చెల్లవట

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో బహిరంగ మురుగుకాల్వలను తొలగించి మట్టి పైపులతో డ్రైనేజీ పనులు చేస్తున్నారు. రహదారి విస్తరించడంతోపాటు అపరిశుభ్రత లేకుండా ఉంటుంది. గత అయిదారు ఏళ్లుగా అన్ని ప్రాంతాల్లో ఇలాంటి మట్టి పైపులనే వాడారు. వీటి నాణ్యత విషయంలోనూ ఏనాడూ పరిశీలించకుండానే చకచకా వేసి సిమెంటుతో కప్పేశారు. స్థానికంగా లభించే పైపులు కాకుండా ఇతర ప్రాంతాల్లోంచి తెప్పించిన వాటిల్లో నాణ్యత, మందం, రెండేళ్ల గ్యారెంటీ ఉన్నవి వేస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి హామీ నిధులతోపాటు ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో లెక్కలేనన్ని పనులు చేశారు. వీటన్నింటికి ఇలాంటి పైపులే వాడగా.. ఇటీవల ఈ పైపుల విషయంలో గందరగోళం నెలకొంది.

**ఒకే రకం.. అయినా పనికి రావా?**

నగర పాలిక కార్యాలయం వెనుకాల మురుగుకాలువ నిర్మించేందుకు ఐఎస్ఐ ముద్ర గల మట్టి పైపులను తెప్పించారు. వీటిపై తెల్లని రంగుతో వేసిన ముద్రనే ఉంది. ఈ పైపులే ఇతర డివిజన్లలో పనులు చేసేందుకు తీసుకొచ్చారు. నగరపాలికలో ఈ పైపులతో పనులు చేసేందుకు సిద్ధమవ్వగా, డివిజన్లలో మాత్రం ఆ పైపులు పనికి రావని పేర్కొంటూ



ఇంజినీరింగ్ అదికారులు పనులు ఆపేశారు. శ్రీనగర్, సప్తగిరికాలనీలో రూ.30 లక్షలతో నిర్మించే డ్రైనేజీ, ఛాంబర్ల పనులను ఆరు నెలల కిందట ఆపేశారు. ఇన్ బిల్ట్ అంటే మట్టితో ఐఎస్ఐ ముద్ర వేసిన పైపుల తయారీ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోనే లేదని ఇతర ఇంజినీరింగ్ అధికారులు అంటున్నారు. గత కొన్ని ఏళ్లుగా ఇవే వాడుతున్నట్లు వివరించారు.

**నాణ్యత లేకపోతే రికవరీ చేస్తారా?**

ఐఎస్ఐ తెల్లని రంగుతో ముద్రించిన పైపులనే నగరమంతా వాడుతుండగా కొత్తగా ఇన్‌బిల్ట్ ముద్రించిన మట్టి పైపులను వాడాలని ఒకరిద్దరు ఇంజినీరింగ్ అధికారులు కొర్రీలు పెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు వాడిన పైపులు నాణ్యత లేకపోతే రికవరీ చేస్తారా? అని పలువురు మాజీ కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. ఏళ్లుగా వీటితోనే పనులు చేస్తుండగా ప్రస్తుతం అడ్డుకోవడం ఏమిటని ఆగ్రహిస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పనులు ఆగినట్లు తెలియదని, పైపుల విషయాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు.

# చకచకా.. ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్ : పేదల సొంతింటి కల నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పరుగులు తీస్తోంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు కొన్ని గృహాలైన ప్రారంభించేందుకు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. లబ్ధిదారుల్లో కొందరు ఖాళీ స్థలంలో ఇల్లు కట్టుకుంటుండగా, మరికొందరు తాత్కాలిక నిర్మాణాలను తొలగించి నిర్మాణం చేపడుతున్నారు.

**జీహెచ్ఎంసీ మినహాయించి..**

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని జీహెచ్ఎంసీ పరిధిలోకి వెళ్లే నియోజకవర్గాలు, డివిజన్లను మినహాయించి మిగిలిన ప్రాంతాల్లోని లబ్ధిదారులను మాత్రమే అధికారులు ఎంపిక చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఎల్బీనగర్,



శేరిలింగంపల్లి నియోజకవర్గాలు, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో రెండు మండలాలు, మేడ్చల్ జిల్లాలో కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు ఇందులో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో ఇళ్ల నిర్మాణం తొలుత మందకొడిగా ప్రారంభమైనా ఏప్రిల్ చివరివారం నుంచి వేగం పుంజుకొంది. మేడ్చల్ నియోజకవర్గంలో తొలుత 4,800 ఇళ్లు నిర్మించాలని భావించిగా, 3500 ఇళ్లకు ప్రణాళికలు రూపొందించారు. ముందుకు వచ్చిన 1028 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు.

**600 చదరపు అడుగుల్లో...** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 400 చదరపు అడుగుల్లో మాత్రమే ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఆదేశాలు జారీచేసింది. నమూనా ఇంటిని పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు మరింత విశాలంగా ఉండేలా చూడాలంటూ ఆదేశించారు. దీంతో 600 చదరపు అడుగుల్లో ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించారు.

# మార్గం సుగమం.. టెండర్ల ఖరారులో జాప్యం

హైదరాబాద్ : సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి డైయిరీఫాం వరకు 5.4 కిలోమీటర్ల మేర నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ టెండర్ల ఖరారులో జాప్యం జరుగుతోంది. వాస్తవానికి ఈనెల 15తో గడువు ముగిసినప్పటికీ టెండర్లను తెరవడంపై అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోవడం లేదు. ఇ-ప్రొక్యూర్ విధానంలో టెండర్లు పిలిచారు. గడువు ముగిసిన దరిమిలా తొలుత సాంకేతికత బిడ్లు పరిశీలించాలి. ఇందులో అర్హత సాధించిన సంస్థల ప్రైస్ బిడ్‌లను తెరుస్తారు. ఇప్పటికే పనులకు శంకుస్థాపన చేసి ఏడాది గడిచింది. ప్యారడైజ్ నుంచి సికింద్రాబాద్, తాడ్‌బండ్, బోయిన్‌పల్లి మీదుగా డెయిరీఫాం వరకు ఈ కారిడార్ నిర్మించనున్నారు. ప్రాజెక్టుకు రూ.652 కోట్లు, భూసేకరణతో కలిపి మొత్తం రూ.1,550 కోట్లు ఖర్చు చేస్తారు. పూర్తయితే 44వ జాతీయ మార్గంలో మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్ వైపు వాహనాల రాకపోకలు ఎంతో సులువు కానున్నాయి. ట్రాఫిక్ సమస్య లేకుండా నగరం నుంచి త్వరగా బయటకు వెళ్లే మార్గం దొరకనుంది. కారిడార్‌లో భాగంగా బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద 600 మీటర్ల భూగర్భ టన్నెల్‌ను నిర్మిస్తారు.

**శామీర్‌పేట మార్గంలోనూ..**

నగరం నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాలకు రవాణా సాఫీగా సాగేందుకు సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఔటర్‌రింగ్ రోడ్డు వరకు (18.10 కిలోమీటర్లు) నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి ఇంకా టెండర్ల ప్రక్రియనే మొదలు కాలేదు. రక్షణశాఖ భూముల బదలాయింపు కొలిక్కి రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 197 ఎకరాల భూసేకరణకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో 113.48 ఎకరాలు రక్షణశాఖ నుంచి సేకరించాల్సి ఉంది. అనంతరం అంతే విలువైన భూమిని మరోచోట ప్రభుత్వం కేటాయించాలి. ఇందుకోసం ఇప్పటికే హెచ్ఎండీఏ పలు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి రక్షణశాఖకు నివేదించింది. అంతేకాక రక్షణ శాఖ భూముల్లో ఒకచోట 5 లక్షల, మరోచోట 2.5 లక్షల గ్యాలన్ల తాగునీటి రిజర్వాయర్లున్నాయి. ఆ శాఖకు చెందిన కొన్ని భవనాలనూ తొలగించాలి. బదులుగా వేరేచోట రిజర్వాయర్లు, భవనాలు నిర్మించి అప్పగించాలి. ఈ ప్రక్రియ పూర్తయితేనే ఆ శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది. ఈ కారిడార్‌కు మొత్తం రూ.3,619 కోట్లు వెచ్చించనున్నారు.

# కార్డులు కొరత.. వివరాల్లేక వెత!

వికారాబాద్ : మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ-మదర్ చైల్డ్ ప్రొటెక్షన్) కార్డులతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. అయితే వీటికి జిల్లాలో కొరత ఏర్పడింది. మాతా, శిశు మరణాల నివారణలో భాగంగా ప్రభుత్వం వీటిని ప్రవేశపెట్టింది. ఇందులో గర్భిణుల పూర్తి వివరాలు, అధార్ కార్డు నంబరు, వారి ఆరోగ్య సమస్యలు, గతంలోనే ప్రసవిస్తే ఆ వివరాలు, గర్భస్థ శిశు వివరాలు, బరువు, ప్రస్తుతం అందిస్తున్న వైద్యం, ముమ్మందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు/చికిత్స తదితరాలను నమోదు చేస్తారు. అంతేకాకుండా హిమోగ్లోబిన్ శాతం, బీపీ, మూత్ర పరీక్షలు, అంగన్‌వాడీ ద్వారా తీసుకుంటున్న పౌష్టికాహారం, శిశువు జన్మించిన అయిదేళ్ల వరకు ఇవ్వాల్సిన టీకాలతో పాటు ఇతర వివరాలు కార్డులో పొందుపరుస్తారు. మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు గర్భిణి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనంతరం తల్లీ బిడ్డలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించిన వైద్యం వివరాలు ఇందులో ఉంటాయి. ఈ కార్డులు ఏడాదిగా సరఫరా చేయడం లేదు. దీంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.

పాత కార్డులతో జిరాక్స్‌లు: కార్డులు అందుబాటులో లేక పలు చోట్ల పాత కార్డులే జిరాక్స్ తీయించి వాటిల్లో రాస్తున్నారు. జిరాక్స్ కాగితం మందంగా లేదు. ఇక జిరాక్స్ తీయించేందుకు రూ.20 నుంచి రూ.50 వరకు వ్యయం చేస్తున్నారు.

**17,213 మంది గర్భిణులు..** జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్‌లో 1,344 మంది గర్భిణులు ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. వీరికి కార్డులు అందుబాటులో లేవు. జిల్లాలో గర్భిణులు 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మొత్తం 17,213 మంది ఉన్నారు. ఉన్నతాధికారులకు నివేదించాం- డాక్టర్ పవిత్ర, మాతా, శిశు సంరక్షణాధికారిణి, వికారాబాద్.

జిల్లాలో ఎంసీపీ కార్డులు సరఫరా కావడంలేదు. దీంతో వీటిని అందించడంలేదు. ప్రస్తుతం జిరాక్స్ తీసిన ప్రతిపైనే వివరాలు నమోదు చేస్తున్నాం.

# గుంతలు గింతే.. కళ్లకు గంతలే



హైదరాబాద్ : నగరంలోని రోడ్లను చూస్తే తవ్వకాల పోటీలు జరుగుతున్నట్టుగా ఉంది. గ్రేటర్‌లో ఎక్కడ చూసినా రోడ్ల చివరన, విభాగినుల వద్ద, రహదారికి అడ్డంగా గుంతలు కనిపిస్తున్నాయి. కాలిబాటల పొడవునా తవ్వకాలు ఇంకా కొనసాగుతున్నాయి. మౌలిక సౌకర్యాల కల్పనకు రహదారులను తవ్వడం అనివార్యం అయినప్పటికీ.. వర్షాలు పడుతున్నప్పుడు కాదు. రోడ్ల తవ్వకం సాధారణమైనప్పటికీ నెలల తరబడి గుంతలను అలాగే వదిలేయకూడదు. కానీ బల్దియా ఇంజినీరింగ్ విభాగం వేటినీ పట్టించుకోవడం లేదు. ఇదే ప్రజలకు శాపంగా మారింది. వేలాది మంది ప్రయాణికులు నడుం, వెన్ను సమస్యకు గురవుతున్నారు. పలు కుటుంబాలు ఆప్తులను కోల్పోతున్నాయి.

**ఇంజినీర్ల నిర్లక్ష్యం:** వేసవిలో తప్ప వర్షాకాలంలో రోడ్ల తవ్వకాలకు అనుమతి ఇవ్వకూడదు. దాదాపు 500కి.మీ పొడవునా రోడ్ల తవ్వకాలకు ముఖ్య ఇంజినీరు కార్యాలయం అనుమతి ఇవ్వగా పని పూర్తయిన మరుసటిరోజే తవ్విన గుంతలను పూడ్చాలన్న నిబంధనను బల్దియా విస్మరించింది. తవ్వకాలకు అనుమతి ఇచ్చే ముందే ఆయా రోడ్ల పునరుద్ధరణకు టెండర్లు పిలవడంపై ఇంజినీర్లు దృష్టి పెట్టలేదు. దీంతో 2 నెలల కిందట తవ్వగా గుంతలు ఇంకా అలాగే ఉన్నాయి.

**ఇవిగో ఉదాహరణలు..**

నెలక్రితం బంజారాహిల్స్ రోడ్డు నెం.1లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి 11 కె.వి విద్యుత్తు తీగలను లాగేందుకు 3 కిలోమీటర్ల పొడవునా తవ్వారు. వారం కిందట మళ్లీ ఆ రహదారిపై తవ్వకాలు మొదలయ్యాయి. మురుగునీటి, వరదనీటి మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి. రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

కేబీఆర్ పార్కు నుంచి బంజారాహిల్స్ రోడ్డు 14కు వెళ్లే రహదారిని ఇటీవల జలమండలి కిలోమీటరు పొడవునా తవ్వేసింది. మ్యాన్‌హోళు దెబ్బతిన్నాయి. వాటిని సరిచేయకుండా గుత్తేదారు మ్యాన్‌హోళ్లను మట్టితో నింపేశారు.

జూబ్లీహిల్స్ అపోలో బస్టాపు నుంచి ఫిల్మ్‌నగర్ కూడలి వరకు ఏడాది కిందట కేబుల్ వైర్ల కోసం తవ్వకాలు జరిగాయి. ఇప్పటికీ ఆ ప్రాంతంలో రోడ్డు పునరుద్ధరణ జరగలేదు.

కేబీఆర్ పార్కు చుట్టూ రోడ్డును ఇరువైపులా తవ్వారు. పంజాగుట్ట కూడలిలో ఎఫ్ఓబీ కింద, పైవంతెన కింద, మెరిడియన్ హోటల్ ఎదురుగా, వేర్వేరు ప్రాంతాల్లో గుంతలు తవ్వారు. కంకర మిశ్రమం రోడ్డుపై పడటంతో వాహనదారులు జారి పడిపోతున్నారు.

షేక్‌పేట నాలా చౌరస్తాలో పైవంతెన కింద తవ్వి ఆ ప్రాంతాన్ని తారు, కంకర మిశ్రమంతో దిమ్మెలా మార్చారు. దాంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

ఎల్బీనగర్ చింతల్‌కుంట చెక్‌పోస్టు నుంచి పెద్దఅంబర్‌పేట వరకు జరుగుతోన్న రహదారి అభివృద్ధి పనులతో, ఉప్పల్ కూడలి నుంచి నారపల్లి వరకు జరుగుతోన్న పైవంతెన నిర్మాణ పనులతో నిత్యం దుమ్ము రేగుతోంది. ఈసీఐఎల్, కాప్రా, తార్నాక, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లోనూ రహదారి తవ్వకం పనులను జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం చేపడుతోంది.

# భావినగరం.. అభివృద్ధి పథం



హైదరాబాద్: రాజధానికి 40 కిలోమీటర్ల దూరంలోని మీర్‌ఖాన్‌పేట్‌లో ఏర్పాటవుతున్న భావినగరంలో నిరంతర అభివృద్ధికి ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. పదేళ్ల వరకు విద్య, ఉపాధి, పరిశ్రమలకు సంబంధించిన కార్యక్రమాలుండాలని ప్రణాళికలను సిద్ధం చేసింది. ఐటీ, ఫార్మా సంస్థలతోపాటు గేమింగ్ జోన్లు, వినోద కేంద్రాలు ఏర్పాటయ్యేందుకు వీలుగా ఫ్యూచర్ సిటీలో స్థలాలను కేటాయించనుంది. భవిష్యత్ విస్తరణకు అనువుగా 56 గ్రామాలు, 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉండాలని మంత్రి డి.శ్రీధర్‌బాబు యోచించారు. ప్రభుత్వం భావినగర అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసి నిర్మాణ పనులను అప్పగించింది. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్ అక్కడ పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయనుంది.

**కొత్త విశ్వవిద్యాయాలు..**

ఇంక్యుబేషన్ కేంద్రాలు: రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్-ముచ్చర్ల గ్రామాల మధ్యలో భావినగరాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పుడు అక్కడ యంగ్ ఇండియా నైపుణ్యాల విశ్వవిద్యాలయం మాత్రమే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ అధికారులు భావించారు. ప్రస్తుతం స్కిల్స్ వర్సిటీతో పాటు మరో రెండు విశ్వవిద్యాలయాలు అక్కడ కార్యకలాపాలు కొనసాగించనున్నాయి. ఏఐ విశ్వవిద్యాలయం ప్రతిపాదనల్లో ఉండగానే ఆస్ట్రేలియా ప్రతినిధులు అక్కడ తమకు స్థలం కేటాయిస్తే ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణ అందించే వర్సిటీని ప్రారంభిస్తామని తెలిపారు. వర్సిటీలకు అనుబంధంగా పరిశోధన, ఇంక్యుబేషన్ కేంద్రాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహమం దించనుంది. కొద్దిరోజుల క్రితం సిరానెట్ వర్క్ సంస్థ ఈ-సిటీని మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది.

**వారాంతాల్లో హాయ్.. హాయ్‌గా**

ఐటీ, ఫార్మా సంస్థలు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు (జీసీసీ) కార్యకలాపాలతోపాటు వారాంతాల్లో ఆటవిడుపుగా గేమింగ్‌జోన్లు, వినోద కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కొన్ని అంతర్జాతీయ సంస్థలు అమ్యూజ్‌మెంట్ పార్కులను ప్రారంభించేందుకు ప్రభుత్వంతో చర్చించాయి. ముంబయి, హైదరాబాద్‌లో క్రీడలను ప్రోత్సహిస్తున్న సంస్థలు అక్కడ శాఖలను ప్రారంభించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. వీటికి అదనంగా నైట్‌బజార్ తరహాలో ఆహారోత్సవాలు, క్రీడా పోటీల నిర్వహణకు ప్రైవేటు సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదించాలని నిర్ణయించాయి.

# ఆనకట్ట.. పంటలకు ఆయువుపట్టు

తాండూరు : జిల్లాలో కాగ్నా, కాకరవేణి నదుల నుంచి వృథాగా పోతున్న వరదను కట్టడి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనువుగా ఉన్న ఆరు ప్రాంతాల్లో ఆనకట్టల (చెక్‌డ్యాంల) నిర్మాణం చేపట్టాలని భావించింది. ఇవి పూర్తయితే ఎగువ నుంచి వచ్చే వరద దాదాపు అరకిలో మీటరు వరకు నిలిచిపోతుంది. ఫలితంగా భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. ఇందులో భాగంగానే 2022-23లో అప్పటి ప్రభుత్వం రూ.43కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం కూడా వాటిని కొనసాగించాలని సర్కారు పచ్చజెండా ఊపింది. మంజూరైన నిధుల ఆధారంగా మూడు చోట్ల గుత్తేదార్లు పనులు ప్రారంభించారు.

**ఒనగూరే ప్రయోజనాలు ఎన్నో..**


ఒక్కో ఆనకట్ట ఆరు అడుగుల ఎత్తుతో అరకిలో మీటరు పొడవునా వరద నిలుస్తుంది. పరీవాహక గ్రామాల్లోని వ్యవసాయ బోర్లు, తాగునీటి వనరుల్లో భూగర్భ జలమట్టం గణనీయంగా పెరుగుతుంది. సాగులో ఉన్న పంటలకు ఎద్దడి లేకుండా నీరు అందుతుంది.

ఒక్కో ఆనకట్ట పరిధిలో ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం 400 నుంచి 600 ఎకరాలు పెరుగుతుంది.

నిలువ ఉన్న నీటిలో మత్స్యకారులు చేపలు పెంచి ఉపాధి పొందవచ్చు. అన్ని కాలాల్లో వాటి వద్ద వన్యప్రాణులు, పక్షులు దాహార్తిని తీర్చుకుంటాయి.

**90 శాతం చొప్పున..**

యాలాల మండలం దేవనూరు కాకరవేణి, బెన్నూరు కాగ్నా నదిపై ఒక్కో ఆనకట్ట పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఎగువ నుంచి అడపాదడపా వస్తున్న వరద అక్కడే ఆగిపోవడంతో జలకళ సంతరించుకుంటున్నాయి. దీనివల్ల భూగర్భజలం వృద్ధి చెందేందుకు దోహద పడింది. వర్షాకాలం పూర్తి కాగానే మిగిలిన పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నారు. తాండూరు మండలం ఖాంజాపూరు కాగ్నానదిపై మరో ఆనకట్ట నిర్మాణం 70 శాతం పూర్తయింది. ప్రస్తుతం వర్షాలు కురవడంతో పనులు ఆగిపోయాయి.



**పనులు మొదలు కాక..**

పెద్దేముల్ మండలం మన్‌సాన్ పల్లి, తాండూరు మండలం చంద్రవంచ, యాలాల మండలం సంగెంకుర్దు సమీపం కాగ్నా నదిలో ఒక్కో ఆనకట్ట నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. వీటిలో ఒక్కో ఆనకట్ట నిర్మాణానికి రూ.7 కోట్ల నుంచి రూ.8కోట్ల వరకు సిద్ధంగా ఉన్నాయి. వేసవిలో పనులు చేపట్టేలా అధికారులు చొరవ చూపలేదు. ఇటీవలే గుత్తేదార్లు ముందుకు వచ్చినా, వానలతో ఆపేశారు. సంగెంకుర్దు వద్ద గుత్తేదారును మార్చాలని అధికారులు ఉన్నత స్థాయి అధికారులను కోరారు. స్పందించక పోవడంతో రెండేళ్ల నుంచి పనులు ఆగిపోయాయి.

**వచ్చే వేసవి నాటికి పూర్తిచేస్తాం- కిష్టయ్య, శిరీష, నీటిపారుదల శాఖ డీఈఈలు.** యాలాల మండలం సంగెంకుర్దు, తాండూరు మండలం చంద్రవంచ, పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి గ్రామాల సమీపం కాగ్నానదిలో వచ్చే వేసవి నాటికి ఆనకట్టల నిర్మాణం పూర్తి చేస్తాం. ప్రస్తుతం పనులు ప్రారంభమై తుదిదశలో ఉన్న వాటిని పూర్తి చేస్తాం.

# అవసరాలకు అనుగుణంగా నడిపేలా..

హైదరాబాద్: ఎంఎంటీఎస్ సర్వీసులను నగరంలో ప్రారంభించి 22 ఏళ్లవుతున్నా ఆశించిన స్థాయిలో ప్రయాణికులకు సేవలు అందడం లేదు. నగరంలోని నాలుగు ప్రధాన స్టేషన్ల నుంచి 225 రైళ్లలో నిత్యం లక్షలాది మంది ప్రయాణికులను గమ్యస్థానం చేర్చే వ్యవస్థలున్నా స్థానికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌ను విస్తరించడంలో జాప్యం జరుగుతోంది. సమయ పాలన లేకపోవడం, ఒకటి, రెండు రైళ్లతో నెట్టుకురావాలని ప్రయత్నిస్తుండమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా నగరంలో స్టేషన్లను పునరుద్ధరిస్తున్న నేపథ్యంలో ఎంఎంటీఎస్ విస్తరణకూ ఇదే మంచి సమయమని ప్రయాణికుల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

**ట్రాక్ సర్క్యూట్‌ను సవరిస్తే..** రేక్‌ల లభ్యత పరిమితంగా ఉన్న క్రమంలో సికింద్రాబాద్-ఫలక్‌నుమా-మేడ్చల్ మార్గంలో తొమ్మిది లేదా పన్నెండు కోచ్‌లకు బదులుగా ఆరు కోచ్‌ల రైళ్లను నడపాలని తద్వారా మిగిలిన ప్రాంతాలకు మరిన్ని రైళ్లు నడిపే అవకాశం ఉంటుందని ప్రయాణ




సంఘాలు పేర్కొంటున్నాయి. కాచిగూడ నుంచి ఉదయాన్నే ప్రారంభించే రైళ్లను అందుకోవడానికి, కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికుల వేళలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ రైళ్లు నడపాలని కోరుతున్నారు. మేడ్చల్ నుంచి ఉదయం 5.30గంటలకు, రెండో రైలు ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యేలా వేళలు మార్చాలని, గంటలో సికింద్రాబాద్ చేరుకునేలా వేళలు మార్చి అక్కడి నుంచి లింగంపల్లికి అనుసంధానించాలని డిమాండ్ చేస్తున్నారు. **వికేంద్రీకరణ అవసరం..** సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్, లింగంపల్లి వంటి స్టేషన్లను వికేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. మెరుగైన నెట్‌వర్క్ వినియోగం కోసం, చర్లపల్లి నుంచి సనత్‌నగర్ లేదా సికింద్రాబాద్ మీదుగా వికారాబాద్ వైపు కొన్ని సర్వీసులను, మల్కాజిగిరి మీదుగా కర్నూలు వైపు మరిన్ని సర్వీసులను ప్రారంభించొచ్చు. సికింద్రాబాద్ స్టేషన్‌లో పనులు పూర్తయ్యే వరకు ముంబయికి సర్వీసులు హైదరాబాద్ లేదా చర్లపల్లి నుంచి నడపొచ్చు. రైల్వేలకు అదనపు ఆదాయం, ప్రయాణికుల సౌలభ్యం కోసం జంట నగరాల్లో ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌ను విస్తరించడంపై అధికారులు దృష్టి సారించాలి.

# పదవుల్లో పైచేయి ఎవరిదో!

కరీంనగర్ : ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు ఆశల లోకంలో విహరిస్తున్నారు. పీసీసీ కార్యవర్గంలో పలువురికి చోటు కల్పించే దిశగా పార్టీ అధిష్ఠానం దిల్లీ కేంద్రంగా కసరత్తు జరుపుతున్న దరిమిలా కొందరు ముఖ్య నాయకులు తమకు అవకాశం వస్తుందనే ధీమాతో ఉన్నారు. రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్న తరువాత నామినేటెడ్ పోస్టుల భర్తీలో కొందరికి అవకాశాలు దక్కగా ఇంకొందరికి పార్టీలో కీలక పదవులను అప్పగిస్తారనే ప్రచారం జరిగింది. దీంతో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన సీనియర్లతోపాటు యువ నాయకులు కూడా పార్టీ పదవుల భర్తీ విషయంలో గంపెడాశలు పెట్టుకున్నారు. నిర్ణయం ఈ నెల 30కి వాయిదా పడటంతో ఆ రోజు కోసం నిరీక్షిస్తున్నారు.

**అమాత్య యోగం దక్కేనా!**

మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు అమాత్య పదవి వస్తుందనే చర్చ పార్టీలో జరుగుతోంది. 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెద్దపల్లి, మంథని, రామగుండం, మానకొండూర్, చొప్పదండి, ధర్మపురి, వేములవాడ.. ఇలా ఏడు నియోజకవర్గాల్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీకి మొదటి దఫాలో మంథని నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీధర్‌బాబుకు మంత్రి పదవిని కట్టబెట్టారు. ఇక కరీంనగర్‌కు చెందిన సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నుంచి గెలిచి బీసీ కోటాలో మంత్రి పదవిని దక్కించుకున్నారు. భారాస నుంచి అయిదుగురు ఎమ్మెల్యేలు గెలవగా జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ కాంగ్రెస్ మద్దతివ్వడంతో సమీకరణాలు మారాయి. ఉమ్మడి జిల్లా నుంచి మరో ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు ఇచ్చే అవకాశముందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మున్నూరు కాపు కోటాలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరు వినిపిస్తోంది. కీలకమైన సిరిసిల్ల జిల్లాలో పార్టీ పట్టును పెంచాలంటే ఆ జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలనే దిశగా చర్చ సాగుతున్నట్లు సమాచారం.

**కొత్త జిల్లాధ్యక్షులు..**

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 10 జిల్లాల్లో కొత్త డీసీసీలను నియమించే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పుడు నాలుగు జిల్లాల్లో ఎమ్మెల్యేలే అధ్యక్షులుగా కొనసాగుతుండటంతో వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇస్తే పార్టీలో ఊపు కనిపిస్తుందనే ఉద్దేశంతో మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు సమాచారం. దీంతో పలువురు ముఖ్య నాయకులు పార్టీ పగ్గాలను అందుకోవాలని కుతూహలం చూపిస్తున్నారు. ఇందుకోసం మంత్రులను కలుస్తూ తమకు అవకాశాన్నివ్వాలని కోరుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులు ఇతరత్రా బిజీగా ఉంటుండటంతో నాలుగు జిల్లాల్లో కొత్త సారథులు వచ్చే అవకాశముందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి.

# చామ కాల్వకు చేవ

నంద్యాల : జిల్లా కేంద్రం నంద్యాల పట్టణాన్ని వరద ముప్పు నుంచి కాపాడేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏటా ముంపునకు కారణమవుతున్న చామకాల్వ వెంట రక్షణ గోడ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మహానంది మండలంలో కురిసిన వర్షంనీరు పాలేరువాగు ద్వారా ప్రవహించి నంద్యాల వద్ద చామకాల్వలో కలుస్తుంది. దీంతో పాటు నంద్యాలలో పడిన వర్షంనీరు, మురుగంతా ఇందులోకే చేరుతుంది. పట్టణ నడిబొడ్డున 9 కి.మీల పొడవున ప్రవహించే ఈ కాల్వ ఆక్రమణలతో కుచించుకుపోయింది. దీంతో భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో వరద నీరు పట్టణాన్ని ముంచెత్తుతోంది. ఆస్తి, ప్రాణ నష్టం కలిగిస్తోంది. ఈ సమస్య పరిష్కారం కోసం 6.70 కి.మీల పొడవున కాల్వను ఆధునీకరించడంతో పాటు రక్షణగోడ, వంతెనలు నిర్మించాలని కేసీ కెనాల్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

**అవసరమైన చోటే భూ సేకరణ**

మొదటి విడతలో మూడు ప్యాకేజీలుగా చామకాల్వ విస్తరణ, రక్షణగోడ, వంతెనల నిర్మాణ పనులన్నీ ఇరిగేషన్ శాఖకు చెందిన భూముల్లో మాత్రమే చేపడతారు. వీటికి కొత్తగా భూమి సేకరించాల్సిన అవసరం లేదు. దీంతో ఖర్చు భారీగా తగ్గనుంది. అత్యవసరమైన చోట్ల మాత్రమే భూమి సేకరిస్తారు. ఎస్‌బీఐ కాలనీ నుంచి సాయిబాబానగర్, గోపాల్‌నగర్, దేవనగర్, సరస్వతినగర్, శ్యాంనగర్, హనీఫ్‌నగర్ మీదుగా ప్రథమనంది ఆలయం సమీపం వరకు బిట్లు బిట్లుగా ఈ పనులు జరుగనున్నాయి.

ఈ పనులు పూర్తయిన తర్వాత రెండో విడత కింద మరికొన్ని పనులు చేపట్టనున్నారు. అప్పుడు అవసరమైతే భూ సేకరణ చేపడతారు.

**వారి హామీలు వరదలో కలిశాయి**

2007లో నంద్యాలకు వరదలొచ్చినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నంద్యాలలో పర్యటించారు. చామకాల్వ, కుందూ, మద్దిలేరు విస్తరణ, సుందరీకరణ, రక్షణ గోడ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఇందుకోసం రూ.100 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత ఈ పనులకు టెండర్లు పిలిచారు. రక్షణ గోడ నిర్మాణం కొంతమేర చేపట్టి వదిలేశారు. తర్వాత ఈ పనుల ఊసే లేకుండాపోయింది. 2017లో చామకాల్వల్లో పూడికతీత పనులు జరుగుతున్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడి హోదాలో నంద్యాలలో పర్యటించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చామకాల్వ, కుందూ ఆధునికీకరణ పనులు చేస్తామని హామీ ఇచ్చారు. 2019 వరదల సమయంలో సీఎం హోదాలో నంద్యాలకు వచ్చిన జగన్ మరోసారి చామకాల్వ ఆధునికీకరణకు హామీ ఇచ్చినా అమలు చేయలేదు. తండ్రీకుమారులైన ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు చామకాల్వ విస్తరణ, రక్షణగోడ నిర్మాణానికి ఇచ్చిన హామీలను విస్మరించారు.

**మూడు ప్యాకేజీలుగా పనులు**


చామకాల్వ ఆధునీకరణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. మొదటి ప్యాకేజీ కింద ముందుగా 6.70 కి.మీల పొడవున రక్షణగోడ నిర్మిస్తారు.రెండో ప్యాకేజీ కింద చామకాల్వను ఆధునీకరిస్తారు. కాల్వ పొడవునా పూడిక, కంపచెట్లు తొలగిస్తారు.

మూడో ప్యాకేజీలో చామకాల్వ మీద పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు వంతెనలు నిర్మిస్తారు. ఈ పనులన్నీ చేసేందుకు రూ.77.34 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు.ఇప్పటివరకు చామకాల్వకు గరిష్ఠంగా వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకుని విస్తరణ పనులు చేపట్టనున్నారు. భారీ వరదలు వచ్చినా పట్టణానికి ముప్పు లేకుండా రక్షణ గోడను నిర్మించనున్నారు.

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం-** ప్రతాప్, ఈఈ, కేసీ కెనాల్, నంద్యాల నంద్యాలలో చామకాల్వ విస్తరణతో పాటు రక్షణగోడ, వంతెనల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. తొలి విడతలో భూమి సేకరించడం లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు చేపడతాం.

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?

తాడేపల్లిగూడెం : పట్టణంలోని రామారావుపేట, సుబ్బారావుపేట, కేఎన్ రోడ్డు, జుబ్లీ రోడ్డు, బేబీ సెంటర్, ఇతర ప్రాంతాల్లో అనధికారికం గా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటు చేశారు. ఇళ్లు.., వాణిజ్య సముదాయాలు, కళ్యాణ మండపాలు, లాడ్జిల్లో సెల్లార్ అద్దెలు చెల్లిస్తూ ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. తణుకు పట్టణంలోని పైవంతెన, ప్రభుత్వాసుపత్రి సమీపంలో, సూర్యాలయం వీధిలో తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ప్రైవేటు ఆసుపత్రులు వెలిశాయి. ఇళ్లు.., అపార్ట్‌మెంట్లలో నిబంధనలకు విరుద్ధంగా వీటిని నిర్వహిస్తున్నారు. జిల్లాలో అనధికారిక ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పురపాలిక నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే ఇళ్లను ఆసుపత్రులుగా మార్చేస్తున్నారు. నిబంధనలు పాటించకపోవడంతో అటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు ఇటు ప్రజల ఆరోగ్యంతోనూ చెలగాటమాడు తున్నారు.



భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో ఇటీవల వెటర్నిటీ, జనరల్ ఫిజీషియన్, సర్జన్, న్యూరో, ఆర్థోపెడిక్, దంత వైద్యం ఇలా పలు విభాగాల్లో ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. జనావాసాల్లో ఇళ్లను, అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని తర్వాత వాటిని ఆసుపత్రులుగా మార్చేస్తున్నారు. ఈ క్రమంలో అనుమతులు తీసుకోవడం లేదు. ఆసుపత్రులకు ఉండాల్సిన కనీస నిబంధనలు పాటించడం లేదు. ఇటీవల తణుకు పట్టణంలోని బొమ్మల వీధిలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న ఆసుపత్రిపై పలువురు మున్సిపాలిటీకి ఫిర్యాదు చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని సుబ్బారావుపేటలో ఓ కల్యాణ మండపంలో ఆసుపత్రి నిర్వహిస్తుండటం గమనార్హం.

**అటకెక్కిన బయో వ్యర్థాల నిర్వహణ..** ఆసుపత్రులు, క్లినిక్‌లు జనావాసాల్లో ఏర్పాటు చేయాలంటే బయో వ్యర్థాల నిర్వహణ, తదితర రక్షణ చర్యలు చేపట్టాలి. కానీ ఇవేమీ పాటించడం లేదు. అత్యవసర సేవలకు వెళ్లాలంటే ఆ స్థాయికి తగిన ర్యాంపు, లిఫ్ట్, ప్రత్యేక మార్గం ఉండాలి. కానీ ఇవేమీ ఉండటం లేదు. బయోవ్యర్థాలను సైతం ఒక్కోసారి బయట పడేస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. 'ఇళ్లను ఆసుపత్రులు, క్లినిక్‌లుగా మారిస్తే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం' అని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు అన్నారు.

# మోకీళ్ల మార్పిడా.. ఏడాది నిరీక్షించాల్సిందే..!



తిరుపతి : వచ్చిన రోజే ఓపీ వైద్యసేవలు అందుతాయనే నమ్మకం.. రోగులకు సరపడా పడకల ఏర్పాటు.. నడవలేని వారికి మోకీళ్ల మార్పిడికి భరోసా.. నాణ్యమైన కృత్రిమ అవయవాల అమరిక.. ఇకనైనా సాధ్యమయ్యేనా అంటూ శ్రీబాలాజీ దివ్యాంగుల శస్త్రచికిత్స, పరిశోధన కేంద్రం (బర్డ్) రోగులు ఎదురుచూస్తున్నారు. గత ఐదేళ్లూ అస్తవ్యస్తమైన ఈ వైద్య వ్యవస్థను సరిదిద్దేందుకు ఆసుపత్రితో సుదీర్ఘ అనుభవం గల గుడారు జగదీష్‌ను మళ్లీ అదే స్థానంలో ప్రభుత్వం నియమించింది. బుధవారం ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

ఒకప్పుడు వేకువజామున ఐదు గంటలకు ఓపీ సేవలు.. 350 పడకల నిండుగా రోగులు.. రోజుకు 30 పైగా శస్త్రచికిత్సలు.. రోగులు, బంధువుల తాకిడితో బర్డ్ ఆస్పత్రి కిటకిటలాడేది. వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు ఆస్పత్రిని రాజకీయ వేదికగా మార్చారు. ఆధిపత్యం కోసం సీనియర్ వైద్యులను నిర్లక్ష్యం చేయడంతో పేదలకు వైద్యం దైన్యంగా మారింది. అయినవారికి మాత్రమే ఉచిత మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేయడం.. మిగిలినవారి నుంచి రూ.72 వేలు, రూ.1.35 లక్షలు చొప్పున వసూలు చేయడం వంటి అస్పష్ట విధానాలు అమలు చేశారు. దీంతో దేశవ్యాప్తంగా వచ్చే రోగులు క్రమంగా తగ్గిపోయారు. ఐదు యూనిట్ల వైద్యసేవలు మూడింటికి పరిమితమయ్యాయి. రోజువారీ శస్త్రచికిత్సల సంఖ్య తగ్గడంతో రోగులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. రోజువారీ ఓపీలు 300కు పడిపోయినా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల తేదీని 2026 జూన్ నాటికి ఇస్తున్నారు. సమయ కేటాయింపు పారదర్శకంగా జరగడం లేదు.

**వైద్యుల్లో సమన్వయం పెరగాలి**

సంచాలకుల పర్యవేక్షణ లేకపోవడంతో బర్డ్‌లో వైద్యుల మధ్య సమన్వయ లోపం నెలకొంది. తితిదే నిబంధనలు కాదని కొందరు ప్రైవేటు సేవలు అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కనీసం వార్డుల్లో రౌండ్లు వేయని పరిస్థితి. ఇదే సమయంలో కొందరు తితిదే.. మరికొందరు బర్డ్ ట్రస్టు నుంచి రావడంతో సమన్వయ లోపం కన్పిస్తోంది. అత్యవసర విభాగానికి ట్రామా కేసులు పెద్దగా రావడం లేదంటే సేవలపై నమ్మకం లేదనే చెప్పాలి. మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో పారదర్శకత తోడు ఇంప్లాంట్ల బిగింపులోని లోటుపాట్లను తక్షణమే సరిదిద్దాల్సి ఉంది.

**పడకల పెంపు అవశ్యం**

ఒకప్పుడు 350 పడకల ఉన్న బర్డ్ ప్రస్తుతం 200 పడకలకే పరిమితమైంది. అందులోనూ కొన్ని విభాగాలు ఖాళీగా ఉన్నాయి. రోగుల తాకిడికి తగ్గట్టుగా పడకల సంఖ్య పెంచాల్సి ఉంది. ఐదేళ్లుగా శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ఆర్థో విభాగం ప్రాక్టికల్ వైద్యవిద్యకు దూరమైంది. ఇకనైనా వీరికి క్లినికల్ విద్యను అందించాల్సి ఉంది.

# ఇసుక తోడేళ్లు.. పడవేం సంకెళ్లు?



చిత్తూరు : నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తాటిపర్తిలో క్వార్ట్ అక్రమ మైనింగ్ కేసులో ఎట్టకేలకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. వైకాపా హయాంలో రూ.138 కోట్ల ఖనిజాన్ని లూటీ చేయడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. ఇదే తరహాలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జగన్ పాలనలో ఇసుకను కొల్లగొట్టారు. నదుల్లో రోడ్లు వేసి సహజ ప్రవాహాన్ని మళ్లించి మరీ దోపిడీకి పాల్పడ్డారు. వైకాపాలోని కీలక నాయకులే ఇందులో కీలక పాత్ర పోషించారు. ఏడాదవుతున్నా వారిపై చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. నాగలాపురం మండలం తమిళనాడుకు ఆనుకుని ఉంటుంది. ఇక్కడి అరణియార్ నదిలోని ఇసుకను అక్రమార్కులు పొరుగు రాష్ట్రానికి అక్రమంగా తరలించారు. జూన్ నుంచి అక్టోబరు వరకు తవ్వకాలు జరపకూడదనే ఆదేశాలున్నా ధిక్కరించారు. ప్రారంభంలో జరిగిన మైనింగ్‌లో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన, మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు సన్నిహితుడైన నాయకుడు హవా చూపారు. ఏడాదిన్నర తర్వాత ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైకాపాలోని 'పెద్ద' నేత పెత్తనం మొదలైంది. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) హెచ్చరికలను కూడా బేఖాతరు చేసి నదిలో గ్రావెల్‌తో రోడ్డు వేసి టిప్పర్ల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఒక్క అరణియార్‌లోనే రూ.150 కోట్లకుపైగా ఇసుకను తవ్వి, తరలించి సొంత జేబుల్లోకి మళ్లించారనే ఆరోపణలున్నాయి. ఎన్‌జీటీ ఆదేశాలతో వైకాపా హయాంలోనే విచారణ జరిపినా ఇప్పటివరకూ ఒక్కరిపైనా చర్యలు లేవు.

**శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నదిని..**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపా హయాంలో నాటి కీలక ప్రజాప్రతినిధి స్వర్ణముఖి నదిని గుల్ల చేశారు. అన్ని మండలాల్లో విచ్చలవిడిగా యంత్రాలు ఉపయోగించి ఇసుక తవ్వేశారు. పదిసార్లు ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తే కేవలం ఒక్కసారి మాత్రమే వచ్చి తూతూమంత్రంగా వాహనాలు సీజ్ చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ నియోజకవర్గంలో యువగళం పాదయాత్రకు వచ్చినప్పుడు నారా లోకేశ్.. ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేటికీ బాధ్యులను గుర్తించలేదు.

**పుంగనూరులో రోజుకు రూ.50 లక్షల విలువైన**

పుంగనూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాలో ఒక్కరే ఆధిపత్యం ప్రదర్శించారు. వైకాపాలోని చోటా నేతలు ఎవరైనా వేలు పెడితే పోలీసులు, రవాణా, గనుల శాఖ అధికారులు రంగంలోకి దిగి జరిమానాలు విధించారు. కీలక నేత నియోజకవర్గంలోని నదులు, చెరువుల్లోని ఇసుకను స్వాహా చేశారు. సోమల మండలంలో 10-15 అడుగుల లోతు వరకు తవ్వి ప్రకృతి సంపదను పట్టపగలే బెంగళూరు తరలించారు. రోజుకు 50-60 టిప్పర్లు పొరుగు రాష్ట్రానికి క్యూ కట్టేవి. ఒక్కరోజు సంపాదనే రూ.50 లక్షల వరకు ఉందని వైకాపా నేతలే చెప్పుకొనేవారు.

**పలమనేరులోనూ ఇలాగే..**

పెద్దపంజాణి, పలమనేరు మండలాల్లోని ఇసుకను బెంగళూరు తరలించారు. ముఖ్య ప్రజాప్రతినిధి రాత్రిళ్లు తరలిస్తే పుంగనూరు నేత సమయంతో సంబంధం లేకుండా చెలరేగిపోయారు.

జీడీ నెల్లూరులోని నీవా నది ఇసుకను బెంగళూరు తరలించారు. చిత్తూరులో నీవా నదిలో ప్రత్యేకంగా రోడ్డు వేసి వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేశారు. నగరి కుశస్థలి నదిలో తవ్వకాలకు అడ్డే లేదు. ఒకానొక దశలో అక్రమ రవాణాను అడ్డుకున్న కానిస్టేబుల్‌పై నాటి మంత్రి రోజా అనుచరుడు విరుచుకుపడ్డారు.

# చిరుతలపై.. నిరంతర నిఘా

తిరుపతి : శేషాచలం కొండల్లో ప్రధానంగా యాత్రికులు రాకపోకలు సాగిస్తున్న అలిపిరి నడక మార్గంలో చిరుత పులుల దాడుల నుంచి భక్తులను రక్షించుకునేందుకు అటవీశాఖ, తితిదే తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. పరస్పర సహకారంతో చిరుతల సంచారంపై ఇప్పటికే నిరంతర పర్యవేక్షణ సెల్ ఏర్పాటైంది. రాత్రి సమయంలో అలిపిరి నడక మార్గంలో తిరుమలకు చేరుకునే భక్తులు వాటి దాడులకు గురికాకుండా ప్రత్యేక వ్యవస్థ సిద్ధం చేశారు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకుని భక్తులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

అటవీశాఖ, తితిదే యంత్రాంగం సుదీర్ఘ చర్యల అనంతరం అలిపిరి నుంచి తిరుమలకు భక్తులు చేరుకునే నడక మార్గంలో లైవ్ కెమెరాలు, థర్మల్ కెమెరాల సాయంతో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటైంది. చిరుతపులుల సంచారం ఎక్కువగా ఉన్న అలిపిరి పాదాల మండపం నుంచి ఏడో మైలు తరువాత ఉన్న నరసింహస్వామి ఆలయం వరకు అటవీ, తితిదే విజిలెన్స్ విభాగాలతో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి వారిని భక్తులకు రక్షణ కవచాలుగా వినియోగిస్తున్నారు. సమస్యాత్మక ప్రదేశాలుగా గుర్తించిన 40 ప్రదేశాల్లో 40 లైవ్ కెమెరాలు బిగించారు. రాత్రుళ్లు సైతం పనిచేసేలా థర్మల్ కెమెరాలు ఏర్పాటు చేశారు. తిరుపతి రేంజ్ కార్యాలయం, అలిపిరి కాలిబాటలోని ఏడో మైలు వద్దనున్న ఫారెస్ట్ మ్యూజియం వద్ద బేస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సిబ్బందితో సమాచారం పంచుకునేందుకు ప్రత్యేకంగా 20 వాకీటాకీలు సమకూర్చారు. చిరుత పులులు, ఎలుగుబంట్లు నడకమార్గం వైపు వచ్చే సమయంలో లైవ్ కెమెరాలతో గుర్తించడం, భక్తుల రక్షణ



బృందాలకు, వారిని పర్యవేక్షించే అధికారులకు సమాచారం చేరవేసేలా బేస్‌స్టేషన్లు పనిచేస్తున్నాయి.

బేస్‌స్టేషన్లు కీలకం.. చిరుతలు, ఎలుగుబంట్ల దాడుల నుంచి భక్తులను రక్షించుకునేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కేంద్రాలకు అనుసంధానంగా బేస్‌స్టేషన్లు పనిచేస్తున్నాయి. 40 లైవ్, థర్మల్ కెమెరాలతో నడక మార్గాన్ని పర్యవేక్షిస్తూ రక్షణ బృందాలు, అధికారులను అప్రమత్తం చేస్తున్నాం. వివేక్, జిల్లా అటవీ అధికారి

# ఈ-యంత్రం.. గోదాంలో భద్రం

ఆదోని : జిల్లాలోని మార్కెట్ యార్డులకు కేటాయించిన యంత్రాలు నిరుపయోగంగా మారాయి. వాటిని వినియోగిస్తే.. రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఈ-నామ్ వ్యవస్థలో భాగంగా కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులకు రూ.లక్షలు వ్యయం చేసి గ్రేడింగ్ యంత్రాలు అందించింది. 2018లో జిల్లాలో ఈ-నామ్(ఈ-నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) విధానం అమల్లోకి వచ్చింది. అందులో భాగంగా 2022-23 ఆర్థిక ఏడాదిలో అంటే గత వైకాపా పాలనలో యంత్రాలు అందించింది. ఒక్కో యంత్రం ఖరీదు సుమారు రూ.50-55 లక్షలు. మార్కెట్ యార్డులకు రైతులు తెచ్చే మల్టీ కమోడిటిస్ పంటలు అంటే కందులు, ఆముదాలు, పూలవిత్తనాలు, శనగలు, కొర్రలు తదితర గింజ దిగుబడులను గ్రేడింగ్ చేసుకొనేందుకు వీటిని తెరపైకి తెచ్చింది.



యంత్ర సేవలు అందుబాటులో లేక రైతులు ధర రూపంలో నష్టపోవాల్సి వస్తోంది. రికార్డు స్థాయిలో ఆదాయాలు

రైతులు పండించిన పంట దిగుబడులపై యార్డులు ఒక శాతం సెస్సు వసూలు చేస్తాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా.. రైతుకు అందాల్సిన సేవలు అందటం లేదు. 2024-25 ఏడాదిలో జిల్లాలోని ఏడు యార్డులకు రికార్డు స్థాయిలో ఆదాయాలు సమకూరాయి. రూ.36 కోట్లకు రూ.39 కోట్లు ఆర్జించాయి. ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డుల ఆదాయం రూ.35 కోట్లు రావడం విశేషం.

**రికార్డు స్థాయిలో ఆదాయాలు**

రైతులు పండించిన పంట దిగుబడులపై యార్డులు ఒక శాతం సెస్సు వసూలు చేస్తాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా.. రైతుకు అందాల్సిన సేవలు అందటం లేదు. 2024-25 ఏడాదిలో జిల్లాలోని ఏడు యార్డులకు రికార్డు స్థాయిలో ఆదాయాలు సమకూరాయి. రూ.36 కోట్లకు రూ.39 కోట్లు ఆర్జించాయి. ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డుల ఆదాయం రూ.35 కోట్లు రావడం విశేషం.

**రైతులకు దక్కని ధర**

పండించిన పంటను త్వరితగతిన అమ్ముకుని అప్పులు, అవసరాలు తీర్చుకోవాలనే ఆలోచనతో చాలా మంది రైతులు ఉన్న సరకును యార్డులకు తెచ్చి కుప్పగా పోసి వచ్చిన ధరకు అమ్ముకుని ఇంటి బాట పడుతున్నారు. రైతుల ఇళ్ల వద్ద స్థలం లేకపోవడం, రక్షణ సాధ్యం కాకపోవడంతో అక్కడే విక్రయించేస్తున్నారు. ఈ-నామ్ వ్యవస్థలో భాగంగా రైతులు గ్రేడింగ్ విధానం అలవాటు చేసుకుని, పంటకు మంచి ధర అందుకోవాలనే ఆలోచనతో గ్రేడింగ్ యంత్రాలు అందించింది. యార్డుకు తెచ్చిన సరకును నామమాత్రపు రుసుంతో రైతులు గ్రేడింగ్ యంత్రం వద్ద శుభ్రం చేసుకుని.. యార్డులో టెండర్‌కు ఉంచడం వల్ల సరకు నాణ్యతగా మారి మంచి ధర పొందొచ్చు. వ్యాపారులకూ ప్రయోజనకరంగానే ఉంటుంది. వీటి సేవలపై రైతులకు అవగాహన కల్పించి లాభపడేలా చేయాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది. దీంతో ఈ-నామ్ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా స్పందించి రైతులకు గ్రేడింగ్ యంత్ర సేవలు అందుబాటులోకి తెచ్చేలా చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

**ఇదీ పరిస్థితి..**

ఆదోనికి ఇచ్చిన యంత్రం యార్డు ఆవరణలోని గోదాంలో ఉంచి, వాటికి తాళాలు వేశారు. ఇక్కడి యార్డుకు ఏడాదికి కందులు, పూలవిత్తనాలు, ఆముదాలు లాంటి పంట దిగుబడులు సుమారు 35 వేల క్వింటాళ్ల దాకా సరకు అమ్మకానికి వస్తోంది. యంత్రం సేవలపై అధికారులను ప్రశ్నిస్తే.. నిర్వహణకు టెండర్ ప్రకటన చేసినా గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదని దాటవేశారు. ఆ తర్వాత మళ్లీ ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం. ఎమ్మిగనూరు యార్డుకు వేరుసెనగ, ఆముదాలు, కందులు తదితరాలు ఏడాదికి 6-7 లక్షల బస్తాలు అమ్మకానికి వస్తాయి. ఇక్కడి యార్డులో యంత్రం నిర్వహణకు విద్యుత్తు సౌకర్యం కల్పించి, ట్రయల్ రన్ చేశారు. ఇక్కడా నిర్వహణకు టెండర్ పిలిస్తే ఎవరూ రాలేదని సమాచారం. కర్నూలులో పంట దిగుబడులు 10-15 వేల క్వింటాళ్లకుపైగా అమ్మకానికి వస్తాయి. ఇక్కడా టెండర్ ద్వారా గుత్తేదారుకు యంత్రం సేవలు అప్పగించారు. రైతుల సేవలకంటే, వ్యాపారుల సేవలో గ్రేడింగ్ యంత్ర సేవలు అందుతాయని సమాచారం. రైతు నుంచి పంట సరకు కొనుగోలు చేసిన వ్యాపారి ఇక్కడి గ్రేడింగ్ చేసుకుని లాభపడుతున్నారు.

# పనులు అసంపూర్ణం.. పూర్తైనా నిరుపయోగం

ఏలూరు : ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసేందుకు వైకాపా ప్రభుత్వం చేపట్టిన 'నాడు-నేడు' పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో 9 రకాల పనులను చేపట్టారు. వాటిలో ఒకటి మరుగుదొడ్ల నిర్మాణం.రెండో విడతలో చేపట్టిన పనుల్లో చాలా వరకు అసంపూర్తిగా నిలిచాయి. కొన్ని బడుల్లో వీటిని నిర్మించినప్పటికీ నిర్వహణ సరిగా లేనందున నిరుపయోగంగా ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తగినన్ని నిధులను విడుదల చేస్తే అసంపూర్తి మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తికాగలవు.

**మండవల్లి మండలంలో..**

చింతపాడు ఉన్నత పాఠశాలలో బాలురకు మరుగుదొడ్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. నాడు-నేడులో మంజూరైనా నేటికీ నిర్మాణం ప్రారంభం కాలేదు. ముదినేపల్లి మండలం కాకరవాడ శివారు దేవరం పాఠశాలలో మూడేళ్లుగా నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు పూర్తవలేదు. శ్లాబ్ లెవల్‌లో నిర్మాణం నిలిచిపోయింది.

**కొయ్యలగూడెంలో..**

రాజవరం మండల పరిషత్తు ప్రత్యేక ప్రాథమిక పాఠశాలకు 2022లో నాడు-నేడు రెండో విడతలో రూ.21 లక్షల అంచనా వ్యయంతో మరుగుదొడ్లు తదితర పనులకు అనుమతులు మంజూరయ్యాయి. పనులు మొదలుపెట్టి మరో మూడు నెలలకు మూడేళ్లవుతుంది. నిర్మాణమైతే పూర్తి చేశారు కానీ లోపల ప్లంబింగ్ పనులు చేపట్టలేదు. పూర్తయితే రంగులు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకు సుమారు రూ.9 లక్షలు మాత్రమే విడుదలయ్యాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఉంగుటూరులో..మండలంలో 22 పనులు మంజూరుకాగా ఇంకా 6 పూర్తి కావాల్సి ఉంది. నాచుగుంట పంచాయతీ పరిధిలోని కొత్తగూడెం ఎంపీపీ పాఠశాలలో మరుగుదొడ్లకు తలుపులు రావాల్సి ఉంది. కాగుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో రంగులు వేయలేదు. బాదంపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మాణం పూర్తయినా వినియోగించడం లేదు.

నాడు-నేడు పనుల వివరాలు రెండో విడత ఎంపిక చేసిన బడులు : 820

మంజూరైన పనులు : 2,608 పూర్తయినవి :2,005

# ఇజ్రాయెల్ చేతిలో కాంతి ఖడ్గం..!

ఇజ్రాయెల్ తమ అమ్ముల పొదిలోని కాంతి ఖడ్గం శక్తిని యుద్ధంలో పరీక్షించింది. డజన్ల కొద్దీ ప్రత్యర్థి డ్రోన్లను కూల్చింది. తాము లేజర్ ఆయుధమైన ఐరన్ బీమ్ వ్యవస్థలో తక్కువ శక్తిమంతమైన ఆయుధం వాడినట్లు ఆ దేశ రక్షణ శాఖ, ఐడీఎఫ్ ప్రకటించాయి. ఈ సరికొత్త సిస్టమ్‌లో తక్కువ శక్తి లేజర్ బీమ్‌ను తాము ఇంటర్‌సెప్టర్‌గా యుద్ధంలో వాడినట్లు పేర్కొన్నాయి. దీనిని ఈ ఏడాది ద్వితీయార్ధంలో పూర్తిస్థాయిలో సైన్యానికి అందించనున్నట్లు వెల్లడించారు. ఈ వ్యవస్థను ఇజ్రాయెల్‌కు చెందిన రఫేల్ సంస్థ అభివృద్ధి చేసింది. హెజ్‌బొల్లా నుంచి డ్రోన్ల ముప్పు పెరగడంతో అనుకున్న సమయం కంటే వేగంగా దీనిని రూపొందించినట్లు రక్షణశాఖ వెల్లడించింది. "ప్రస్తుత యుద్ధంలో మా వైమానిక రక్షణ వ్యవస్థలతో సహా.. లేజర్‌వ్యవస్థలను కూడా మోహరించాము. అవి చాలా అద్భుతంగా పనిచేశాయి. శత్రువులు ప్రయోగించిన ఆయుధాలను అద్భుతంగా అడ్డుకొని పౌరుల ప్రాణాలు కాపాడటంతోపాటు.. దేశ ఆస్తులను రక్షించాయి" అని




ఐడీఎఫ్, ఇజ్రాయెల్ రక్షణశాఖ వెల్లడించాయి. ఈ మేరకు ఐరన్ బీమ్ వ్యవస్థ విజయవంతంగా డ్రోన్లను కూల్చివేసిన దృశ్యాలను విడుదల చేసింది. మరోవైపు రఫేల్ సంస్థ ఛైర్మన్ యువల్ స్టెయింట్జ్ స్పందిస్తూ.."ప్రపంచంలోనే తొలిసారి అత్యంత శక్తిమంతమైన లేజర్‌ను పూర్తిగా వినియోగించి.. యుద్ధాల్లో ఇంటర్ సెప్టర్ వాడిన దేశంగా ఇజ్రాయెల్ నిలిచింది" అని పేర్కొన్నారు.

**మూడు శ్రేణుల్లో లేజర్ల అభివృద్ధి..** ఇజ్రాయెల్ ఇప్పటివరకు మూడు శ్రేణుల్లో లేజర్ ఆయుధాలను అభివృద్ధి చేసింది. వీటిల్లో ఐరన్ బీమ్-ఎం అనేది భారీ వాహనాలపై అమర్చే శక్తిమంతమైన ఆయుధం. ఇది 50 కిలోవాట్ల శ్రేణి లేజర్‌తో ప్రత్యర్థి ఆయుధాలను కూల్చేస్తుంది. వివిధ లేయర్లు ఉండే రక్షణ వ్యవస్థల్లో భాగంగా దీనిని వాడొచ్చు. ఐరన్ బీమ్‌లోనే తేలికపాటి వెర్షన్‌గా భావించి లైట్ బీమ్‌ను కూడా అభివృద్ధి చేసింది. దీనిని చిన్న వాహనాలపై అమర్చి ఉపయోగించవచ్చు. ఇది 10 కిలోవాట్ల శ్రేణి హైఎనర్జీ లేజర్ ఆయుధం. యూఏవీలు, డ్రోన్ల దండుపై ప్రభావంతంగా పనిచేస్తోంది. దీంతో ప్రత్యర్థి డ్రోన్లను కూల్చడానికి అయ్యే ఖర్చు నామమాత్రమే అని రఫేల్ కంపెనీ వెల్లడించింది. ఏకకాలంలో కొన్ని కిలోమీటర్ల దూరంలోని 10 లక్ష్యాలను ఇది కూల్చగలదు. ఇక యుద్ధ నౌకల పైనుంచి వినియోగించే నేవల్ ఐరన్‌బీమ్‌ను కూడా అభివృద్ధి చేసింది. ఇది 100 కిలోవాట్ల హైఎనర్జీ లేజర్‌ను వాడి యుద్ధ నౌకలను రక్షిస్తుంది. యుద్ధనౌకలపై ఉన్న రక్షణ వ్యవస్థలు పెద్ద సంఖ్యలో దూసుకొస్తున్న ముప్పుతో (సాచురేటెడ్ అటాక్) బిజీగా మారినప్పుడు ఇది శక్తిమంతంగా పనిచేస్తుంది. కొన్ని వందల మీటర్ల నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలోని ముప్పును ఇది అడ్డుకొంటుంది. ఇంటర్‌సెప్షన్‌కు అయ్యే ఖర్చు కూడా చాలా నామమాత్రమని కంపెనీ పేర్కొంటోంది.




# పన్నులుండవ్, లగ్జరీ లైఫ్.. సంపన్నుల స్వర్గధామం 'మొనాకో'

అదో చిన్న దేశం. ఫ్రాన్స్‌కు ఆగ్నేయంగా ఉన్న మధ్యధరా తీరప్రాంతం. జనాభా కేవలం సుమారు 38వేలు. కానీ.. ఎక్కడ చూసినా ఖరీదైన కార్లు, భవనాలు, తీరంలో కళ్లు చెదిరే యాట్‌లే దర్శనమిస్తాయి. ప్రపంచంలో ఎక్కడా లేనంత మంది మిలియనీర్లు ఇక్కడే కనిపిస్తారు. ఇక్కడ స్థిరనివాసం కోసం కొంతమంది చూస్తుంటే.. మరికొందరు మాత్రం కనీసం ఇక్కడ చిరునామా ఉంటే చాలని భావిస్తున్నారు. లగ్జరీ లైఫ్‌స్టైల్, ఆదాయపు పన్ను మినహాయింపు వంటి నిబంధనలతో సంపన్నులకే స్వర్గధామంగా మారింది. అదే.. మొనాకో.

**చిన్న దేశమైనా..** ఇక్కడ ఏ మూల చూసినా సంపన్నులే. లాంబోర్గినీ, రోల్స్ రాయిస్‌తోపాటు అనేక రకాల సూపర్‌కార్లు మొనాకో వీధుల్లో విహారం చేస్తుంటాయి. అటు తీర ప్రాంతంలోనూ ఫ్లోటింగ్ మాన్షన్స్‌గా దర్శనమిస్తాయి. ఇక్కడ జరిగే మొనాకో గ్రాండ్ ప్రిక్స్ రేసింగ్ భారీ స్థాయిలో నిర్వహిస్తారు. ఈవెంట్‌ను చూసేందుకు వచ్చిన వారితో వీధులు మొత్తం నిండిపోతాయి. పేరుకు చిన్నదేశమైనప్పటికీ.. సంపదలో మాత్రం ప్రపంచంలో అగ్రదేశాల సరసన ఉంటుంది. వరల్డ్ బ్యాంకు నివేదిక ప్రకారం.. ఇక్కడివారి తలసరి జీడీపీ 2.56లక్షల డాలర్లు (రూ.2.18కోట్లు). ఇది అమెరికాకంటే (82వేల డాలర్లు) ఎక్కువ. మొత్తంగా ఇక్కడ నివసిస్తున్న ప్రతి ముగ్గురిలో ఒకరు సంపన్నులే కావడం విశేషం.

**లగ్జరీ లైఫ్, పన్నులుండవ్..** మొనాకోకు సంపన్నులు క్యూ కట్టడం వెనక భద్రతాపరంగా సురక్షిత ప్రాంతం కావడం, అంతర్జాతీయ స్కూళ్లు, వరల్డ్ క్లాస్ వైద్య సదుపాయాలు, ఆదాయపు పన్ను నిబంధనలు ప్రధాన అంశాలుగా కనిపిస్తున్నాయి. ఇక్కడ వ్యక్తిగత ఆదాయపు పన్ను ఉండదు. మూలధన లాభాల పన్ను కూడా లేదు. వారసత్వ పన్ను కూడా చెల్లించనవసరం లేదు. కొందరికి ఉన్నా.. గరిష్ఠంగా 16% మాత్రమే ఉంటుంది. ఉన్నత జీవన ప్రమాణాలు, రాజకీయ స్థిరత్వం కూడా సంపన్నులు మొనాకోవైపు చూడటానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

**ఆర్థిక సంక్షోభం నుంచి..** ఇప్పుడు ఇంతటి సంపన్న నగరంగా పేరొందిన మొనాకో.. 19వ శతాబ్దం మొదట్లో తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో మాంటే కార్లో క్యాసినో ఏర్పాటు చేస్తూ ప్రిన్స్ చార్లెస్ III తీసుకున్న నిర్ణయం మొనాకో తలరాతనే మార్చేసింది. ప్రధానంగా ఆదాయపు పన్ను రద్దు చేయడం సంపన్నులను ఆకర్షించింది. ఫ్రాన్స్ పౌరులకు మినహా మరెవ్వరికీ ఇక్కడ ఆదాయపు పన్ను ఉండదు. ఇందుకు సంబంధించి 1869లోనే ఓ ఒప్పందం జరిగింది. క్యాసినోల నుంచి వచ్చే ఆదాయాన్నే ప్రభుత్వ ఖర్చులకు వినియోగిస్తారు. రియల్ ఎస్టేట్ పరంగానూ అత్యంత ఖరీదైన నగరమిది.

**అడుగుపెట్టడం భారమే..** ఇంత లగ్జరీ నేపథ్యమున్న మొనాకోకు వెళ్లడం అంత సులువు కాదు. ఇక్కడ నివాసం ఏర్పరచుకోవాలన్నా.. ఆదాయపు పన్ను ప్రయోజనాలను ఎంజాయ్ చేయాలన్నా కొన్ని నిబంధనలను పాటించాల్సిందే. ఇక్కడకు రావాలంటే కనీస వయసు 16ఏళ్లు ఉండాలి. ఎటువంటి నేరచరిత్ర లేదని పోలీసు ధ్రువీకరణ అవసరం. సొంతిళ్లు లేదా రెంటెడ్ హౌస్ ఉంటేనే అనుమతిస్తారు. ఇక్కడ ఉండడానికి ఆర్థికంగా బలంగా ఉన్నామని నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఏడాదిలో ఆరునెలల కంటే ఎక్కువ కాలం ఉండాలి. తక్కువ వ్యవధి ఉండాలంటే అదనపు దస్త్రాలు అవసరం. అయితే, ప్రపంచంలో కేవలం మొనాకోలో మాత్రమే ఆదాయపు పన్ను మినహాయింపు లేదు. యూఏఈ, ఖతర్, బెర్ముడా, ఒమన్, కువైట్ దేశాల్లోనూ ఇటువంటి అవకాశాలున్న విషయం తెలిసిందే.

# ట్రంప్ టారిఫ్‌లకు కోర్టు బ్రేక్..

## విచారణలో భారత్-పాక్ ఉద్రిక్తతల ప్రస్తావన

వాషింగ్టన్: 'లిబరేషన్ డే' పేరుతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై భారీస్థాయిలో సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు న్యాయస్థానం ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ టారిఫ్‌లు అమలుకాకుండా యూఎస్ ట్రేడ్ కోర్టు నిలుపుదల చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం కింద అధ్యక్షుడికి ప్రపంచదేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ విచారణ సందర్భంగా 'భారత్-పాక్ ఉద్రిక్తతల' అంశాన్ని ట్రంప్ సర్కారు ప్రస్తావించగా.. కోర్టు దాన్ని తోసిపుచ్చింది. అధ్యక్షుడికి ఉన్న టారిఫ్ అధికారాలను సమర్థించాలని ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. చట్టపరంగా ఎదురైన ఈ సవాల్.. చైనాతో వాణిజ్య సంధిని మార్చేస్తుందని, భారత్-పాక్ మధ్య




ఘర్షణలను పెంచుతుందని అధికారులు వాదించారు. "టారిఫ్ అధికారం వల్లనే ఇటీవల భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ట్రంప్ సాధించగలిగారు" అని కోర్టుకు తెలిపారు. సుంకాలకు సంబంధించి ప్రస్తుతం అనేక దేశాలతో చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ సర్కారు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. ఈ ట్రేడ్ డీల్స్‌ను ఖరారు చేసుకునేందుకు జులై 7 వరకు గడువు ఉందని, అప్పటివరకు దీన్ని చాలా సున్నితమైన అంశంగా పరిగణించాలని కోర్టును కోరింది. అయితే ట్రంప్ అడ్మిస్ట్రేషన్ చేసిన అన్ని వాదనలను కోర్టు తిరస్కరించింది. "అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం కింద అధ్యక్షుడికి కాంగ్రెస్ అపరిమిత అధికారాలను అప్పగించలేదు. అఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించేందుకు కాంగ్రెస్‌కు రాజ్యాంగం ప్రత్యేక అధికారాన్ని కల్పించింది. దీన్ని అధ్యక్షుడి అత్యవసర అధికారాలతో అధిగమించలేరు. ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమే అవుతుంది" అని కోర్టు తీర్పు వెలువరించింది. దీనిపై వెంటనే ట్రంప్ సర్కారు అప్పీల్ దాఖలు చేసింది. కోర్టు తీర్పుతో ఇప్పుడు వైట్‌హౌస్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై స్పష్టత లేదు. ఎమర్జెన్సీ పవర్ టారిఫ్‌ను నిలిపివేయనుందా? లేదా కొత్త సుంకాలు విధిస్తారా అన్నది తెలియరాలేదు. ఈ సుంకాలను ఆపితే.. ట్రంప్‌నకు ఉన్న అధికారాల ప్రకారం ద్రవ్యలోటు ఉన్న దేశాలతో తాత్కాలికంగా 150 రోజుల వరకు 15శాతం దిగుమతి పన్ను విధించే అవకాశాలున్నాయి.

## సినిమా 'షో'

# సీతా పయనం టీజర్ టాక్..!




40 ఏళ్ళ నుంచి నటుడిగా ప్రేక్షకులను అలరిస్తున్న అర్జున్ సర్జా దర్శకుడిగా మారి చేస్తున్న సినిమా సీతా పయనం. ఈ సినిమాలో తన కూతురు ఐశ్వర్య అర్జున్ హీరోయిన్ గా నటిస్తుంది. నిరంజన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నాడు. సీతా పయనం సినిమాకు సంబంధించిన టీజర్ లేటెస్ట్ గా రిలీజైంది. ఈ టీజర్ చూస్తే ఒక కారులో ప్రయాణం చేసే టైంలో పరిచయమయ్యే హీరో హీరోయిన్ ఆ తర్వాత వారి మధ్య ఏం జరిగింది అన్నది కథ. సినిమాలో హీరోయిన్ చాలా ప్రాక్టికల్ గా ఉంటుంది. ఆమెది చాలా పెద్ది ఫ్యామిలీ.. మరోపక్క హీరో కూడా ఫైట్లు గట్రా చేస్తూ కనిపించాడు. ఇద్దరు వారి ప్రయాణంలో ప్రేమలో పడతారు కానీ ప్రపోజల్స్ లాంటివి జరగవు. ఇంతకీ ఈ ఇద్దరి పయనం ఎలా జరిగింది.. ఎటు వెళ్లింది అన్నది సీతా పయనం కథ అనిపిస్తుంది. నటుడిగానే కాదు దర్శకుడిగా కూడా అర్జున్ తన పనితనం చూపించేలా టీజర్ ఉంది. ఇక ఐశ్వర్య అర్జున్ స్క్రీన్ ప్రెజన్స్ బాగుంది. నిరంజన్ అనే కొత్త హీరోని పరిచయం చేస్తున్నాడు అర్జున్ సర్జా. ఐతే ఈ సినిమా టీజర్ లో ధ్రువ్ సర్జా సర్ ప్రైజ్ ఇచ్చాడు. అతని క్యామియో సినిమాకు హైలెట్ కానుంది. అంతేకాదు డైరెక్టర్ అర్జున్ సర్జా కూడా ఈ సినిమాలో ఉన్నట్టు తెలుస్తుంది. మొత్తానికి టీజర్ ఆసక్తికరంగా మలిచారు. సీతా రామం తరహా లోనే సీతా పయనం టైటిల్ అనిపిస్తున్నా ఆ సినిమాకు ఈ సినిమాకు అసలేమాత్రం సంబంధం లేదని టీజర్ చూస్తే అర్థమవుతుంది. అర్జున్ సర్జా డైరెక్టోరియల్ మూవీ ఎలా ఉండాలో దానికి ఏమాత్రం తగ్గకుండా ఉండేలా ఉంది ఈ సీతా పయనం. మరి ఈ సినిమా టీజర్ ఇంప్రెస్ చేయగా సినిమా ఏమేరకు ప్రేక్షకులను అలరిస్తుందో చూడాలి. ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ అందిస్తున్న మ్యూజిక్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచేలా ఉంది. యూత్ ఫుల్ లవ్ స్టోరీస్ కి అనూప్ మెలోడీ మ్యూజిక్ అదిరిపోతుంది. సీతా పయనం లో కూడా అనూప్ వర్క్ ఆడియన్స్ ని ఇంప్రెస్ చేసేలా ఉందనిపిస్తుంది. అర్జున్ సర్జా దర్శకుడిగా చేస్తున్న ఈ సీతా పయనం మూవీ ప్రేక్షకులను ఎలాంటి పయనాన్ని కలిగిస్తుందో చూడాలి.

# బాలీవుడ్‌లోని ఈ వింత అగ్రిమెంట్ గురించి తెలుసా?

'ఇస్మార్ట్ శంకర్'తో సక్సెస్‌ను దక్కించుకున్న నిధి అగర్వాల్ ఇండస్ట్రీలో ఆశించిన స్థాయిలో స్టార్‌డం దక్కించుకోలేక పోయింది. ఆ సినిమా తర్వాత ఆమె ఎంపిక చేసుకున్న ప్రాజెక్టులు తీవ్రంగా నిరాశ పరిచాయి. కానీ ప్రస్తుతం చేస్తున్న రెండు సినిమాలు ఆమె స్టార్‌డంను ఎక్కడికో తీసుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్‌తో కలిసి హరి హర వీరమల్లు సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న నిధి అగర్వాల్ మరో వైపు ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రాజాసాబ్ సినిమాలోనూ నటిస్తుంది. రాజాసాబ్ సినిమాలో ముగ్గురు హీరోయిన్స్‌లో ఒక హీరోయిన్‌గా నిధి అగర్వాల్ నటిస్తున్న విషయం తెల్సిందే. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను అందుకోబోతున్నట్లు నిధి అగర్వాల్ చాలా ఆశగా ఎదురు



చూస్తుంది. ఆ సినిమాల ఫలితాలపై ఒక క్లారిటీ వచ్చే వరకు నిధి అగర్వాల్ కొత్త ప్రాజెక్ట్‌లను కమిట్ అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఆ రెండు సినిమాలు ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాకున్నా.. నిధి అగర్వాల్ రెగ్యులర్‌గా తన అందమైన ఫోటో షూట్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయడం ద్వారా లేదంటే ఇంటర్వ్యూల కారణంగా వార్తల్లో నిలుస్తోంది. తాజాగా మరో ఇంటర్వ్యూతో నిధి అగర్వాల్ వార్తల్లో నిలిచింది. ఈసారి బాలీవుడ్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం ద్వారా అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. నిధి అగర్వాల్ మొదటి సినిమా హిందీలోనే నటించిన విషయం తెల్సిందే. ఆ హిందీ సినిమాలో నటించేందుకు చేసుకున్న అగ్రిమెంట్ గురించి నిధి అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. టైగర్ ష్రాఫ్ హీరోగా నటించిన 'మున్నా మైకేల్' సినిమాలో నిధి అగర్వాల్ నటించింది. అంతకు ముందు మోడలింగ్ చేసిన నిధి అగర్వాల్ బాలీవుడ్‌లో అవకాశం రావడంతో అగ్రిమెంట్ కనీసం చదవకుండానే సైన్ పెట్టిందట. ఆ అగ్రిమెంట్‌లో హీరోతో డేటింగ్ చేయకూడదని కండీషన్ ఉందట. సినిమా షూటింగ్ పూర్తి అయ్యేంత వరకు హీరోతో రిలేషన్‌షిప్ పెట్టుకున్నట్లు తెలిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ఆ అగ్రిమెంట్‌లో ఉందట. ఆ విషయం తెలిసి నిధి అగర్వాల్ షాక్ అయిందట. ఇలాంటివి కూడా అగ్రిమెంట్‌లో పెడతారా అని ఆ సమయంలో ఆశ్చర్యపోయాను అంటూ నిధి అగర్వాల్ తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.

# దేవియాని.. మినీ స్కర్ట్ లో కిర్రాక్ స్టిల్

టాలెంటెడ్ యాక్ట్రెస్ దేవియాని శర్మ తన నటనతో పాటు ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తో కూడా మంచి గుర్తింపు సంపాదించుకుంటోంది. మోడలింగ్‌లో కెరీర్‌ను మొదలుపెట్టిన ఈ ముంబై బ్యూటీ, 'అనగనగా', 'సైతాన్', 'సేవ్ ద టైగర్స్' వంటి వెబ్‌సిరీస్‌ల ద్వారా ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. నటనతో పాటు సోషల్ మీడియాలోనూ విపరీతంగా యాక్టివ్‌గా ఉండే ఈ అమ్మడు.. గ్లామర్ ఫొటోషూట్లతో ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తుంటుంది. ఇక లేటెస్ట్ గా దేవియాని షేర్ చేసిన ఫోటోస్ మరోసారి నెటిజన్లను షాక్‌కు గురి చేశాయి. పింక్ బౌ డిజైన్ ఉన్న ట్రెండీ టాప్, రెడ్ మినీ స్కర్ట్ కాంబినేషన్‌లో స్టైలిష్‌గా కనిపించిన దేవియాని.. డేర్ లుక్‌తో అటెన్షన్ దక్కించుకుంది.



సింపుల్ మేకప్, సాఫ్ట్ కర్ల్ హెయిర్ స్టైల్‌తో ఆమె మోడరన్ ఎలిగెన్స్‌ను ప్రెజెంట్ చేసింది. చేతిపై ఉన్న టాటూ, కిల్ ద లుక్ అనే విధంగా ఇచ్చిన క్యాప్షన్‌తో ఫోటోకు మరింత హైపు వచ్చింది. ఈ లుక్‌లో దేవియాని కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె ఫోటోలో ఉన్న పొజ్, నయన సౌందర్యం చూసిన నెటిజన్లు 'ఫైర్', 'బోల్డ్ అండ్ బ్యూటిఫుల్', 'ఫ్యాషన్ ఐకాన్' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె షేర్ చేసిన ఈ ఫోటోకు "జస్ట్ కిల్ ఇట్" అనే క్యాప్షన్ ఉంది. ఇది ఈ లుక్‌కు ఎంత కాన్ఫిడెంట్‌గా పోజ్ ఇచ్చిందో తెలిపేలా ఉంది. అందం, అభినయం, స్టైల్.. ఈ మూడింటినీ మిక్స్ చేసిన ఈ ముద్దుగుమ్మ.. వెబ్ సిరీస్‌లతో పాటు త్వరలోనే ఫీచర్ ఫిల్మ్‌లకు కూడా ఎంట్రీ ఇవ్వబోతుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఈ మధ్యకాలంలో ఫొటోషూట్స్‌కు ఇచ్చే ప్రాధాన్యత, క్యాప్షన్స్‌కు లోపల ఉన్న భావోద్వేగం చూస్తే.. దేవియాని కెరీర్ మరింత డైనమిక్‌గా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ గ్లామరస్ లుక్‌తో సోషల్ మీడియాలో దుమ్మురేపుతున్న దేవియాని.. తన ఫ్యాషన్ గేమ్‌ను మళ్లీ ఒక లెవెల్‌కు తీసుకెళ్లిందనే చెప్పాలి.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P. and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. **R.N.I. No. APTEL/2013/48712** Editor : CHALLA MADHUSUDHANA RAO